



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక  PEN POWER TELUGU DAILY  ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1  సంచిక : 20  పేజీలు : 8  సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ)  ప్రచురణ : కావలి, నెల్లూరుజిల్లా  సోమవారం 1 డిసెంబర్ 2025  వెల : 1/-రూ ॥

VOLUME :1  ISSUE : 20  PAGES : 8  EDITOR : G. A. RAO ( ANAND GANTYADA )  PUBLISHED : KAVALI, NELLORE DIST,  MON 1 DECEMBER 2025  PRICE : 1/- RS

Simultaneously Published form : ,SPSR Nellore, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa, Hyderabad, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం...

# 11 మంది దుర్మరణం



- శివగంగ జిల్లా తిరుపత్తూర్ సమీపంలో ఘటన
- కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో పెరగనున్న మృతుల సంఖ్య
- వారం రోజుల వ్యవధిలోనే ఇది రెండో పెద్ద బస్సు ప్రమాదం

తమిళనాడులో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శివగంగ జిల్లాలోని తిరుపత్తూర్ సమీపంలో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో ఒక చిన్నారితో సహా 11 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, ఒక బస్సు తిరుప్పూర్ నుంచి కారైకుడి వస్తుండగా... మరో బస్సు కారైకుడి నుంచి దిండిగల్‌కు ప్రయాణిస్తోంది. తిరుపత్తూర్ వద్దకు రాగానే ఈ రెండు బస్సులు ఢీకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులను శివగంగ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు 2లో..



## ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టాలి

- ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టాలని ఈసీని కోరిన టీడీపీ
- ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం అనంతరం లావు శ్రీకృష్ణ దేవరాయలు వెల్లడి
- ఇతర రాష్ట్రాల్లో ఈసీ చేపట్టిన సవరణను స్వాగతిస్తున్నామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని తెలుగుదేశం పార్టీ విజ్ఞప్తి చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నామని, ఇదే తరహాలో ఏపీలోనూ ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ పార్లమెంటరీ

వివరాలు 2లో..

# ‘పేదల సేవలో’ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలి..

## టీడీపీ నేతలకు సీఎం చంద్రబాబు సూచన

- నిరంతరం ప్రజల్లో ఉండాలని హితవు
- ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్న టీడీపీ అధినేత
- పింఛన్ల పంపిణీని పేదల సేవగా భావించాలన్న చంద్రబాబు



పెన్ పవర్ డెస్క్:రాజకీయ నాయకులు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండే వారే నాయకులుగా రాణిస్తారని ఆయన చెప్పారు. ఈమేరకు పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ‘పేదల సేవలో’ కార్యక్రమంలో పార్టీ నాయకులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పింఛన్ల పంపిణీని పేదల సేవగా భావించాలని నేతలకు తెలిపారు. ‘పేదల సేవలో’ కార్యక్రమంలో నాయకుల భాగస్వామ్యం ప్రస్తుతం 25 వేలకు చేరిందని చంద్రబాబు వెల్లడించారు.

## అధికారులు ప్రతి కాల్ కు స్పందించాలన్న హోంమంత్రి అనిత



- దిత్వా తుపానుపై హోంమంత్రి అనిత ఉన్నతస్థాయి సమీక్ష
- 5 జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ
- లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు
- దక్షిణాంధ్రలో భారీ వర్షాలు, బలమైన గాలుల హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:బంగాళాఖాతంలో ఏర్పడిన ‘దిత్వా’ తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. హోంమంత్రి అనిత సచివాలయంలో ఉన్నతాధికారులు, 5 జిల్లాల కలెక్టర్లతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సహాయం కోసం వచ్చే ప్రతి కాల్‌కు తక్షణమే స్పందించాలని, ప్రాణనష్టం జరగకుండా చూడటమే లక్ష్యమని అధికారులకు స్పష్టం చేశారు.ఈ సమీక్షలో భాగంగా ఆర్టీజీఎస్ స్టేట్ సెంటర్ నుంచి నెల్లూరు, తిరుపతి, కడప, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లతో హోంమంత్రి

వివరాలు 2లో..

## నక్సల్ ఉద్యమానికి మరో దెబ్బ... 37 మంది మావోయిస్టుల లొంగుబాటు


- ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో 37 మంది మావోయిస్టులు లొంగుబాటు
- వీరిలో 27 మందిపై మొత్తం రూ. 65 లక్షల రివార్డు
- ప్రభుత్వ ‘పూనా మర్గం’ పునరావాస విధానంతోనే మార్పు
- లొంగిపోయిన వారికి రూ. 50 వేల ఆర్థిక సాయం, ఇతర ప్రయోజనాలు
- గ్రామస్తుల మద్దతు కరువవడంతోనే లొంగుబాటని వెల్లడి

వివరాలు 2లో..



## తరుముకొస్తున్న దిత్వా తుపాను...

### 20 సెం.మీ పైగా వర్షం పడే అవకాశం




- నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు ఆకస్మిక వరదల హెచ్చరిక
- మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ
- తీరం దాటకుండానే బలహీనపడనున్న దిత్వా తుఫాను
- దక్షిణ కోస్తా, రాయలసీమలో అతి భారీ వర్షాలు, ఈదురుగాలులు
- రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, అధికార యంత్రాంగం అప్రమత్తం

వివరాలు 2లో..

## ‘ఐబొమ్మ’ వెబ్‌సైట్‌లో నేను కూడా సినిమాలు చూశాను

### సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు

- ‘ఐబొమ్మ’ రవిని కాదు, సినిమా మాఫియాను ఉరితీయాలన్న నారాయణ
- వందల రూపాయల టికెట్ ధరల వల్లే ఇలాంటివి పుట్టుకొస్తున్నాయని వెల్లడి
- వ్యవస్థలోని లోపాలే రవి లాంటి వారిని తయారుచేస్తున్నాయని వ్యాఖ్యలుస
- ఒక హిడ్మాను చంపితే వెయ్యి మంది పుడతారన్న నారాయణ



వివరాలు 2లో..

## ఏపీ హక్కుల కోసం పార్లమెంటులో పోరాడాలని వైసీపీ ఎంపీలకు జగన్ పిలుపు

- నేటి నుంచి పార్లమెంటు శీతాకాల సమావేశాలు
- రైతుల సమస్యలపై పార్లమెంటులో గట్టిగా పోరాడాలని ఎంపీలకు జగన్ సూచన
- తుపాను నష్టపరిహారం, కనీస మద్దతు ధర కోసం పట్టుబట్టాలని ఆదేశం
- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపు
- ఉపాధి హామీ కార్డుల తొలగింపు, శాంతిభద్రతల క్షీణతపై గళమెత్తాలని దిశానిర్దేశం

వివరాలు 2లో..



## భారత క్రీడారంగానికి ఇది ‘సూపర్ హిట్’ నెల: ‘మన్ కీ బాత్’లో ప్రధాని మోదీ ప్రశంసల వర్షం



- మహిళల క్రికెట్, కబడ్డీ ప్రపంచకప్‌ల విజయాలపై ప్రత్యేక అభినందనలు
- అంధుల మహిళా క్రికెట్ జట్టు విజయం చరిత్రలో నిలిచిపోతుందన్న ప్రధాని
- డెఫ్లింపిక్స్, వరల్డ్ బాక్సింగ్‌లోనూ పతకాల పంట పండించిన భారత క్రీడాకారులు
- విజేతల ధైర్యం, పట్టుదల దేశానికే స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# రాజధానికి అసలు ఎన్ని ఎకరాలు కావాలి? భూసమీకరణ ఆగదా?

ప్రభుత్వం పారదర్శకంగా ఉండాలి. ప్రజలకు తాము తీసుకుంటున్న నిర్ణయాలను వివరించాలి. గోప్యంగా ఉంచితే అనేక అనుమానాలు బయలుదేరతాయి. రాజధాని అమరావతి విషయంలోనూ ఇదే జరుగుతుంది. గతంలో మొదటిదశలో రైతుల నుంచి సేకరించిన 34 వేల ఎకరాలు, ప్రభుత్వానికి సంబంధించిన భూములు మొత్తం యాభై నాలుగు వేల ఎకరాలున్నాయి. అయితే ఈ యాభై నాలుగు వేల ఎకరాల్లో కేవలం ఏడు వందల ఎకరాలు మాత్రమే మిగిలాయని ప్రభుత్వం చెబుతుంది. మరొకసారి రెండో విడత భూసేకరణకు సిద్ధమయింది. దీంతో అనేక అనుమానాలు ప్రజలు, రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రధాన మీడియాల్లోనూ, సోషల్ మీడియాల్లోనూ అనేక రకాలుగా ప్రచారం జరుగుతుంది. కప్పి ఉంచడం వల్ల రెండో విడత సమీకరణపై పడే అవకాశముంది.

**యాభై నాలుగువేల ఎకరాల్లో...**

రాజధాని పేరుతో సేకరించిన తొలివిడత 54 వేల ఎకరాల్లో రాజధాని ఎక్కడ అన్నది చెప్పాలన్నది ప్రజల నుంచి వినిపిస్తున్న ప్రశ్న. ముంబయి ఛత్రపతి విమానాశ్రయం 1850 ఎకరాల్లో ఉంటే అమరావతికి ఐదు వేల ఎకరాలు ఎందుకన్న ప్రశ్న తలెత్తుంది. పైసా తీసుకోకుండా రాజధాని కోసం రైతులు భూములు ఇస్తే పప్పు బెల్లాలుగా ఇష్టమొచ్చినట్లు పంపిణీ చేయడం ఏంటన్న ప్రశ్న తలెత్తుంది. ఇంజినీరింగ్ కళాశాలలకు ఎకరం యాభై లక్షలకు కేటాయించినా కనీసం రాజధాని రైతుల పిల్లలకు ఆ కళాశాలల్లో రాయితీ కూడా ఇవ్వడం లేదు. తామిచ్చిన భూముల్లోనే తమపై పెత్తనం ఎందుకని కొందరు రైతులు ప్రశ్నిస్తున్నారు. మొదటి దశలో 25 గ్రామాల నుంచి 34 వేల ఎకరాలు తీసుకున్నారు. 29 వేల మంది రైతులు భూములు ఇచ్చారు. వారికి ఇచ్చిన ప్లాట్లకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా రెండో విడత భూసమీకరణకు ప్రభుత్వం ఎందుకు సిద్ధమవ్వాలని వారు ప్రశ్నిస్తున్నారు.

**పదకొండేళ్ల నుంచి...**

ఒకవైపు తమ సమస్యలు పదకొండేళ్ల నుంచి అలాగే ఉన్నా, మరికొందరిని బలి చేయడానికి ఎందుకు నిర్ణయాలు తీసుకుంటారని రాజధాని రైతులు ప్రశ్నిస్తున్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు కూడా ఇదే ప్రశ్నను లేవనెత్తారు. రాజధానికి రెండో విడత భూసమీకరణకు భూములిచ్చి తొలి విడత ఇచ్చిన రైతులకు అన్యాయం చేయవద్దని ఆయన కోరుతున్నారు. అసలు యాభై నాలుగు వేల ఎకరాలకు ఎవరెవరికి ఇచ్చారని శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా ఒకటి అభివృద్ధి జరిగిన తర్వాత మరొక దానిని అభివృద్ధి చేయడం కోసం సేకరించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ పనిచేయకుండా రాజధాని నిర్మాణానికి ఎన్ని వేల ఎకరాలు కావాలో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

**మొదటి దశలో ఇచ్చిన భూముల్లో...**

మొదటి దశలో ఇచ్చిన భూముల్లో డిజైన్లు వేసి రాజధాని నిర్మాణానికి ఓకే అని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు తాజాగా మలి విడత భూసమీకరణకు తాము ఎందుకు సహకరించాలన్న ప్రశ్న రైతుల నుంచి సూటిగా వినిపిస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం పారదర్శకంగా రాజధాని భూముల విషయంలో వ్యవహరించాలని కోరుతున్నారు. అలాగని ముందుకు వెళితే తాము న్యాయస్థానాలను ఆశ్రయించక తప్పదని వడ్డే శోభనాద్రీశ్వరరావు లాంటి రైతు సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. ఏ రాష్ట్రంలోనైనా విమానాశ్రయం ముప్ఫయి నుంచి నలభై కిలోమీటర్ల దూరంలో ఉంటుందని, కానీ రాజధాని నడిబొడ్డులో విమానశ్రయం నిర్మాణం అవసరమా? ఇక గన్నవరం విమానాశ్రయాన్ని ఏం చేయనున్నారో చెప్పాలంటూ నిలదీస్తున్నారు. మొత్తం మీద రెండో విడత భూసమీకరణ మాత్రం ప్రభుత్వానికి అంత తేలికగా కనిపించడం లేదు.

# అధికారులు ప్రతి కాల్ కు స్పందించాలన్న హోంమంత్రి అనిత

- మొదటి పేజి తరువాయి

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. (నవంబర్ 30), రేపు (డిసెంబర్ 1) తుపాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయిలో యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. "ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అధికారులను ముందే నియమించాలి. ప్రజల నుంచి కంట్రోల్ రూమ్‌లకు వచ్చే ఒక్క కాల్‌ను కూడా విస్మరించకూడదు" అని అనిత గట్టిగా సూచించారు. బలమైన ఈదురుగాలులకు చెట్లు, హోర్డింగులు కూలే ప్రమాదం ఉన్నందున వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని, మహిళలు, వృద్ధులు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా, తాము అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామని, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్లు మంత్రికి వివరించారు. మరోవైపు, దక్షిణాంధ్ర జిల్లాల్లో గంటకు 50-70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రభుత్వం ఇప్పటికే ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచింది. ప్రజలు అనవసరంగా బయటకు రావద్దని, అధికారుల సూచనలు పాటించాలని హోంమంత్రి విజ్ఞప్తి చేశారు.

# ఏపీ హక్కుల కోసం పార్లమెంటులో పోరాడాలని వైసీపీ ఎంపీలకు జగన్ పిలుపు

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంతో పాటు, ఆంధ్రప్రదేశ్ హక్కుల సాధన కోసం పార్లమెంటులో గట్టిగా పోరాడాలని వైసీపీ అధినేత జగన్ పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీలతో సమావేశమయ్యారు. తుఫాను నష్టంతో పాటు, పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్ పీ) లభించకపోవడంతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ఈ అంశాలపైనే ప్రధానంగా దృష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు. 'మొంథా' తుపాను కారణంగా కోస్తా జిల్లాల్లో లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, సర్వం కోల్పోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవడంలో విఫలమయ్యాయని జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తమ ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా నేరుగా పంటలను కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించిందని, ఇప్పుడు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో రైతులు దళారుల చేతుల్లో నలిగిపోతున్నారని ఆవేదన చెందారు. వరి, మొక్కజొన్న, మినుములు, పత్తి, కంది, అరటి, మిర్చి, మామిడి వంటి అన్ని ప్రధాన పంటలకు మద్దతు ధర పడిపోయిందని, దీనివల్ల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. పార్లమెంటులో ఈ అంశాన్ని ప్రస్తావించి, రైతులకు తక్షణమే అత్యవసర సహాయ నిధులతో పాటు, మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించేలా ఒత్తిడి తీసుకురావాలని ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ప్రీమియం భారం లేకుండా ఉచిత పంటల బీమా అందించామని, ఇప్పుడు ఆ పథకాన్ని నిలిపివేయడంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జగన్ విమర్శించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందడం లేదని, ఈ-క్రాప్ నమోదును నిలిపివేయడంతో పరిహారం పొందేందుకు కూడా రైతులు అనర్హులుగా మారుతున్నారని అన్నారు. మిర్చి రైతులకు ఆర్థిక సాయం చేస్తామని చెప్పి మోసం చేశారని, మామిడి రైతులను కూడా ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు.

ఇదే సమయంలో, రాష్ట్రవ్యాప్తంగా 18.63 లక్షలతో సహా మొత్తం లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డులను రద్దు చేయడంపై జగన్ మండిపడ్డారు. దీనివల్ల గ్రామీణ కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నాయని, వెంటనే అర్హులైన వారి కార్డులను పునరుద్ధరించి, పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేయాలని ఎంపీలకు సూచించారు. విశాఖ స్టీల్ ప్లాంటును ముక్కలు చేసి ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్లాంటుకు సొంత గనులు కేటాయించి, వేలాది మంది కార్మికుల జీవితాలను కాపాడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, రాజకీయ కక్ష సాధింపులు పెరిగిపోయాయని, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఆరోపించారు. రాష్ట్రానికి రావలసిన నిధులు, ఉపాధి కల్పన, హక్కుల పరిరక్షణ కోసం పార్లమెంటు వేదికగా గట్టిగా పోరాడాలని జగన్ తన ఎంపీలకు స్పష్టం చేశారు.

# తరుముకొస్తున్న దిత్వా తుపాను...

## 20 సెం.మీ పైగా వర్షం పడే అవకాశం

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన 'దిత్వా' తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాలు వణికిపోతున్నాయి. ముఖ్యంగా నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 20 సెంటీమీటర్లకు పైగా అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, దీనివల్ల ఈ జిల్లాల్లో రేపు ఆకస్మిక వరదలు సంభవించవచ్చని తెలిపారు. ఇవాళ నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ప్రజలను అప్రమత్తం చేసింది. తుపాను ముప్పు దృష్ట్యా భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు 'రెడ్ అలర్ట్' ప్రకటించింది. తుపాను ప్రభావంతో ఆదివారం దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ప్రకాశం, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో అక్కడక్కడా అతి భారీ వర్షాలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల, పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. ఉత్తర కోస్తా, యానాంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

వర్షాలతో పాటు దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, అప్పుడప్పుడు వాటి వేగం 80 కిలోమీటర్లకు చేరే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఉత్తర కోస్తాలో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, సోమవారం వరకు మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లవద్దని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం సూచించింది. కృష్ణపట్నం పోర్టులో మూడో నంబర్ ప్రమాద హెచ్చరికను, విశాఖపట్నం, మచిలీపట్నం, నిజాంపట్నం, గంగవరం, కాకినాడ పోర్టులలో రెండో నంబర్ హెచ్చరికలను ఎగురవేశారు.

**అప్రమత్తమైన అధికార యంత్రాంగం**

తుపాను హెచ్చరికలతో రాష్ట్ర హోంమంత్రి వి. అనిత అధికారులను అప్రమత్తం చేశారు. విపత్తుల నిర్వహణ శాఖ ఇప్పటికే సహాయక చర్యల కోసం నెల్లూరు జిల్లా వెంకటగిరిలో మూడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించింది. మరో మూడు బృందాలను సిద్ధంగా ఉంచింది. ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నక్సల్ ఉద్యమానికి మరో దెబ్బ...

## 37 మంది మావోయిస్టుల లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దంతెవాడ జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న 'లోన్ వర్రాటు', 'పూనా మర్గం' (పునరావాసం ద్వారా పునరుజ్జీవనం) పథకాలకు ఆకర్షితులై 37 మంది మావోయిస్టులు ఆదివారం లొంగిపోయారు. వీరిలో 27 మందిపై మొత్తం రూ. 65 లక్షల రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు. హింసామార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పునరావాస విధానంపై తమకు పూర్తి నమ్మకం ఉందని లొంగిపోయిన మావోయిస్టులు పేర్కొన్నారు. దంతెవాడలోని డీఆర్జీ కార్యాలయంలో పోలీసు, సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల సమక్షంలో వీరు లొంగిపోయారు. వీరిలో 12 మంది మహిళలు కూడా ఉన్నారు. వారి నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ మాట్లాడుతూ.. "మా నిరంతర ప్రయత్నాలు, స్థానిక ప్రజల మద్దతు ఫలించాయి. అడవుల్లో జీవించడం కష్టంగా మారిందని, పోలీసులు అన్ని ప్రాంతాలకు చేరుకుంటున్నారని, గ్రామస్తుల నుంచి కూడా మద్దతు లభించడం లేదని లొంగిపోయిన వారు చెబుతున్నారు" అని వివరించారు.

లొంగిపోయిన వారిలో కొందరు సీనియర్ మావోయిస్టు కమాండర్లకు బాడీగార్డులుగా పనిచేసిన వారు కూడా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం లొంగిపోయిన వారికి రూ. 50,000 ఆర్థిక సాయంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ, వ్యవసాయ భూమి వంటి అదనపు ప్రయోజనాలు అందిస్తారు. గత 20 నెలల్లో దంతెవాడ జిల్లాలో 165 మంది రివార్డు ఉన్న మావోయిస్టులతో సహా మొత్తం 508 మంది లొంగిపోయారని అధికారులు తెలిపారు. ఈ పరిణామం హింసారహిత బస్తర్ దిశగా వేసిన మరో కీలక అడుగు అని వారు అభివర్ణించారు.

# భారత క్రీడారంగానికి ఇది 'సూపర్ హిట్' నెల:

## 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంసల వర్షం

భారత క్రీడా రంగానికి గడిచిన నెల ఒక సూపర్ హిట్ నెలగా నిలిచిపోయిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 128వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడుతూ.. పలు అంతర్జాతీయ క్రీడా పోటీలలో భారత క్రీడాకారులు సాధించిన అద్భుత విజయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్ నుంచి కబడ్డీ, బాక్సింగ్ వరకు వివిధ రంగాల్లో మన అథ్లెట్లు దేశానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, "భారత క్రీడా రంగం పరంగా ఈ నెల ఒక సూపర్ హిట్‌గా నిలిచింది. ఐసీసీ మహిళల ప్రపంచ కప్ గెలవడంతో ఈ నెల ప్రారంభమైంది. ఆ తర్వాత కూడా క్రీడా మైదానాల్లో మన వాళ్ల జోరు కొనసాగింది. కొద్ది రోజుల క్రితం టోక్యోలో జరిగిన డెఫ్లింపిక్స్‌లో భారత క్రీడాకారులు 20 పతకాలు సాధించి, ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు" అని తెలిపారు.

అంతేకాకుండా, భారత మహిళా కబడ్డీ జట్టు ప్రపంచ కప్‌ను కైవసం చేసుకోవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. టోర్నమెంట్ ఆరంభం నుంచి చివరి వరకు ఆధిపత్యం ప్రదర్శించిన మన అమ్మాయిలు, గ్రూప్ స్టేజ్‌లోని అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించారు. సెమీ-ఫైనల్‌లో ఇరాన్‌పై 33%-%21 స్కోరుతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లారు. తుదిపోరులో చైనీస్ తైపీ జట్టును 35%-%28 తేడాతో ఓడించి విశ్వవిజేతగా నిలిచారు. "మన మహిళా క్రీడాకారులు కబడ్డీ ప్రపంచ కప్ గెలిచి చరిత్ర సృష్టించారు. టోర్నమెంట్ అంతటా వారి అద్భుతమైన ప్రదర్శన ప్రతి భారతీయుడి హృదయాన్ని గెలుచుకుంది" అని మోదీ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, గ్రేటర్ నోయిడాలో జరిగిన వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లోనూ భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. ఈ టోర్నమెంట్‌లో మన క్రీడాకారులు మొత్తం 20 పతకాలు సాధించారు. ఇందులో తొమ్మిది స్వర్ణాలు, ఆరు రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి. అయితే, ఈ విజయాలన్నింటిలోనూ అంధుల మహిళా క్రికెట్ జట్టు సాధించిన ప్రపంచ కప్ విజయం అత్యంత ప్రత్యేకమైనదని ప్రధాని మోదీ అభివర్ణించారు. టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అజేయంగా నిలిచి కప్ గెలవడం వారి అసామాన్య ప్రతిభకు నిదర్శనమని అన్నారు. ఈ విజయం తర్వాత తాను జట్టు సభ్యులను తన నివాసంలో కలుసుకున్నానని ఆయన గుర్తుచేసుకున్నారు. "మిత్రులారా, వీటన్నింటికన్నా ఎక్కువగా మన మహిళల అంధుల క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలవడంపై చర్చ జరుగుతోంది. విశేషమేమిటంటే, ఈ టోర్నమెంట్‌లో మన జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా గెలిచింది. ఈ జట్టులోని ప్రతి క్రీడాకారిణిని చూసి దేశ ప్రజలు గర్విస్తున్నారు. కేవలం రెండు రోజుల క్రితమే నేను ఈ జట్టును ప్రధానమంత్రి నివాసంలో కలిశాను. నిజంగా, ఈ జట్టు ధైర్యం, పట్టుదల మనకు ఎంతో నేర్పుతాయి. మన క్రీడా చరిత్రలోని గొప్ప విజయాలలో ఇదొకటి. ఇది ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని ప్రధాని మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ విజయాలు భారత క్రీడాకారుల అంకితభావానికి, కఠోర శ్రమకు నిదర్శనమని ఆయన కొనియాడారు.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం...

## 11 మంది దుర్మరణం

- మొదటి పేజి తరువాయి

తమిళనాడులో వారం రోజుల వ్యవధిలోనే ఇలాంటి ఘోర ప్రమాదం జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. నవంబర్ 24న తెన్కాశి జిల్లాలో రెండు ప్రైవేట్ బస్సులు ఢీకొన్న ఘటనలో ఐదుగురు మహిళలు సహా ఆరుగురు మరణించగా, 56 మంది గాయపడ్డారు. ఆ ప్రమాదానికి డ్రైవర్ అతివేగమే కారణమని పోలీసులు నిర్ధారించారు. ఆ ఘటనలో మృతుల కుటుంబాలకు సీఎం ఎంకే స్టాలిన్ రూ. 3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

# ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టాలి

- మొదటి పేజి తరువాయి

పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు స్పష్టం చేశారు. సోమవారం నుంచి పార్లమెం ట్ శీతాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో, ఆదివారం ఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరించాలని ఈ సమావేశంలో ప్రభుత్వం అన్ని పార్టీలను కోరింది. అయితే, ఇదే సమావేశంలో ప్రతిపక్షాలు ఓటర్ల జాబితా సవరణపై ఉన్న ఆందోళనలపై పార్లమెంటులో చర్చ జరగాలని పట్టుబట్టాయి. ఈ నేపథ్యంలో ఎన్డీయే మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ తరఫున లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ.. ఏపీలో ఓటర్ల జాబితా సవరణ ఆవశ్యకతను నొక్కిచెప్పారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అఖిలపక్ష సమావేశంలో తాము పలు కీలక అంశాలను లేవనెత్తినట్లు తెలిపారు. ముఖ్యంగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీ అంశంపై ఈ సమావేశాల్లో సమగ్ర చర్చ జరగాలని కోరినట్టు వివరించారు. ఈ వివాదం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

అలాగే, కేంద్ర ప్రభుత్వ పథకమైన జల్ జీవన్ మిషన్ గురించి కూడా ప్రస్తావించినట్లు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. ఈ పథకం అమలు విధానం, దాని ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు చేకూరే ప్రయోజనాలపై స్పష్టత కోసం పార్లమెంటులో చర్చ జరపాలని కోరినట్లు చెప్పారు. దీనివల్ల పథకం అమలులో పారదర్శకత వస్తుందని, రాష్ట్రానికి దక్కాల్సిన ప్రయోజనాలు పూర్తిగా అందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇదిలా ఉండగా, ఓటర్ల జాబితాలో పేర్లను సరిచూసుకునేందుకు వీలుగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో %హా×=% షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం మరో వారం పాటు పొడిగించింది. రాబోయే ఎన్నికల నాటికి ఓటర్ల జాబితాలను మరింత కచ్చితంగా, సమగ్రంగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. అండమాన్ నికోబార్ దీవులు, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. తాజా షెడ్యూల్ ప్రకారం, గణన ప్రక్రియను డిసెంబర్ 11 వరకు పొడిగించారు. ముసాయిదా ఓటర్ల జాబితాను డిసెంబర్ 16న ప్రచురించి, 2026 జనవరి 15 వరకు అభ్యంతరాలు, చేర్పులకు అవకాశం కల్పిస్తారు. తదుపరి దశలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా ఈ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టే అవకాశం ఉంది.

## 'ఐబొమ్మ' వెబ్‌సైట్‌లో నేను కూడా సినిమాలు చూశాను: సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు

సీపీఐ అగ్రనేత కె.నారాయణ 'ఐబొమ్మ' వెబ్‌సైట్ వ్యవహారంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐబొమ్మ రవిని శిక్షించడం కంటే అసలైన సినిమా మాఫియాను ఉరితీయాలని, అప్పుడే సమాజానికి మేలు జరుగుతుందని అన్నారు. తాను కూడా ఐబొమ్మలో ఉచితంగా సినిమాలు చూశానని ఈ సందర్భంగా నారాయణ వెల్లడించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. టికెట్ ధరలను రూ. 600-700కు పెంచితే సామాన్యులు సినిమాలు ఎలా చూస్తారని ఆయన ప్రశ్నించారు. "కోట్లు ఖర్చుపెట్టి, టికెట్ ధరల కోసం అడుక్కుంటారు. సామాన్య ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వం సాయం చేస్తుందా? కోట్లాది రూపాయలు దోచుకుంటున్న వారిని ఐబొమ్మ రవి దెబ్బకొట్టారు" అని నారాయణ వ్యాఖ్యానించారు. ఒకరిని జైల్లో వేయడం వల్ల ప్రయోజనం లేదని, వ్యవస్థలోని లోపాలను సరిదిద్దాలని సూచించారు.

వ్యవస్థలోని లోపాలను సరిచేయనంత కాలం ఇలాంటి వ్యక్తులు పుట్టుకొస్తూనే ఉంటారని నారాయణ హెచ్చరించారు. "ఒక ఐబొమ్మ రవిని జైలులో వేస్తే మరో వంద మంది వస్తారు. అదే విధంగా, మావోయిస్టు నేత హిడ్మాను చంపడం ద్వారా వెయ్యి మంది హిడ్మాలు పుడతారు" అని అన్నారు. వ్యవస్థాగత వైఫల్యాల వల్లే రవి లాంటి వారు తప్పుడు మార్గంలోకి వెళుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యక్తులను శిక్షించడం సమస్యకు పరిష్కారం కాదని, అసలు సమస్య వ్యవస్థలోనే ఉందని నారాయణ స్పష్టం చేశారు. ఈ వ్యవస్థే ఐబొమ్మ రవి లాంటి వ్యక్తులను సృష్టిస్తోందని, లోపాలను సరిదిద్దకపోతే భవిష్యత్తులోనూ ఇలాంటి వారు వస్తూనే ఉంటారని ఆయన పేర్కొన్నారు.

# మాకు అసెంబ్లీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని పల్లవికి ఎమ్మెల్యే అభినందనలు



నాయుడుపేట, పెన్ పవర్, నవంబర్ 30:అమరావతిలో జరిగిన మాక్ అసెంబ్లీలో పాల్గొని ప్రతిభ చాటిన నాయుడు పేట జడ్పీ హై స్కూల్ విద్యార్థిని కావలి పల్లవి ని ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ అభినందించారు.ఆదివారం నాయుడు పేట పట్టణంలోని జడ్పీ హైస్కూల్లో జరిగిన అభినందన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 175 మంది విద్యార్థుల్లో పల్లవి ఒకరు కావడం జిల్లా విద్యారం గానికి గౌరవకరం అన్నారు.ఈ మాక్ అసెంబ్లీలో విద్యార్థులు స్పీకర్గా,ప్రొటెమ్ స్పీకర్గా,మంత్రులుగా, ప్రతిపక్ష నాయ కులుగావిభిన్న పాత్రలు పోషిస్తూ శాసనసభ కార్యకలా పాలను అద్భుతంగా ప్రదర్శించారని తెలిపారు.పల్లవి తన పాత్రను అత్యుత్తమంగా నిర్వర్తించి అందరి ప్రశంసలు అందుకో వడం అభినందనీయం అన్నారు.విద్యార్థుల్లో నాయ కత్వ గుణాలు, ప్రసంగ నైపుణ్యం ప్రజాస్వామ్య వ్యవస్థపై అవ గాహన పెంపొందించేందుకు మాక్ అసెంబ్లీ ఒక గొప్ప వేదిక అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం తమ ప్రభుత్వం తీసుకున్న అత్యున్నత నిర్ణయాల్లో ఒకటి అని పేర్కొన్నారు.అలాగే ఎమ్మెల్యే విద్యాశాఖకు ధన్యవా దాలు తెలియజేసి ఇలాంటి మరెన్నో కార్యక్రమాల్లో మరింత మంది విద్యార్థులు పాలుపంచుకునేలా అవకాశాలు విస్తరిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహన దారుడు మృతి



పలమనేరు,పెన్ పవర్,నవంబరు 30,: నియోజకవర్గ పరిది లోని పెద్దపంజాని మండలంలో ఆదివారం లారీ ఢీకొన్న ప్ర మాదంలో ద్విచక్రవాహన దారుడు మృతి చెందారు.కాగా స్థానికులు సమాచారం మేరకు వివరాలిలా.. ఆదివారం మం డలంలోని ముత్తుకూరు వస్తున్న అంజి అనే వ్యక్తిని ఎదురుగా వస్తున్న టెన్ వీలర్ లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులకు అక్కడ కు చేరుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.ప్రమాదానికి గల కారణాలు పూర్తిగా పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

# ఏపీఎన్జీజీఓ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక !

### వరుసగా ఐదవసారి అధ్యక్షులుగా కె.ఆనందబాబు



పలమనేరు,పెన్ పవర్,నవంబరు 30,పలమనేరు తాలూకా ఏపీఎన్జీజీఓస్ సంఘం ఎన్నికలు ఆదివారం పట్టణంలోని ఎన్జీఓ హోంలో జరిగాయి.కాగా ఈ ఎన్నికల్లో కె. ఆనంద బాబు,మండల ప్రజా పరిషత్ బైరెడిపల్లెలో పరిపాలనాధి కారిగా పనిచేస్తూ,వరుసగా 5వసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కార్యదర్శిగా పిహెచ్సి పతికొండలో హెల్త్ సూపర్వైజర్ ఎం.జయమ్మ ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్య క్షుడిగా పంచాయతీ కార్యదర్శి బి.ఎస్.మోహనరాం ప్రసాద్, ఉపాధ్యక్షులుగా లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఎన్. సురేష్,సెరికల్చర్ సీనియర్ అసిస్టెంట్ ఎన్. ప్రభాకర్,సబ్ ట్రెజరీ జూనియర్ అకౌంటెంట్ ఆర్.రాజశేఖర్ ఎన్నికయ్యారు.మహిళా ఉపాధ్యక్షు రాలిగా పిహెచ్సి.కొలమాసన పల్లిలో ఏఎన్ఎం ఎంపీహెచ్ డబ్ల్యూఈ నాగేశ్వరమ్మ ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఇరిగే షన్ సబ్డివిజన్ లో ఎటీవో పి.శ్రీనివాసులు ఎంపికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా పంచాయతీ అభివృద్ధి అధికారి ఎస్.హరి,వార్డ్ అడ్మిన్ సెక్రటరీ ఆర్. జలంధర్ నాయుడు, వి.కోట ఇంజినీరింగ్ అసిస్టెంట్ పి.జ్ఞానేశ్వర్ ఎన్నికయ్యారు. మహిళా సంయుక్త కార్యదర్శిగా గంగవరం%-%2లో ఏఎన్ఎం ఎన్.ఎన్ వల్లెమ్మ ఎన్నికయ్యారు.ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగావెల్ఫర్ సహాయకుకు పి. రమణ(కుర్మాయి%-%పలమనేరు),పీడీవో టి. సురేష్ బాబు (తీర్థం%-%బైరెడిపల్లి), సీనియర్ అసిస్టెంట్ కె. వినయ్ కుమార్ (ఎంపిపి%-%వి.కొట),పీడీవో వర్ధని రాజు (గంగవరం),పంచాయతీ సెక్రటరీ ఈ.గణేశ్ (పెద్దచల్లారి గుంట పి.ఎస్-బైరెడిపల్లి),వెల్ఫర్ అసిస్టెంట్ ఎ. చిన్నప్పయ్య (కల్లుపల్లి-గంగవరం మండలం), ఎంపిహెచెస్ జి.మధు (పిహెచ్సి-కొలమాసనపల్లి),టైపిస్ట్ పీ. పురుషోత్తం (పిఆర్ఐ-ఎస్డీ-పలమనేరు),విలేజ్ సర్వేయర్ పీ. వెంకట్రమణ(బోయచిన్నాగనపల్లి%వి.కోట)ఏకగ్రీవంగాఎన్నిక య్యారు.మహిళా ఉద్యోగుల సమస్యల కోసం ప్రత్యేక మహిళా మహిళా విభాగం ఏర్పాటు:మహిళా విభాగం చైర్పర్సన్గా పిహెచ్సి%-%బైరెడిపల్లెలో ఎంపీ హెచ్ఏ గా పనిచేస్తున్న ఎన్.జయ ప్రభావతి ఎన్నికయ్యారు. కో%-చైర్పర్సన్గా ఎంపిపిపలమ నేరులో టైపిస్ట్ ఏ.సి.ఉషారాణి, వైస్-చైర్పర్సన్గా పసుప త్తూరు -గంగవరం పరిధిలో ఏఎన్ఎం ,ఏ. విజయలక్ష్మి ఆర్ఎస్కే-కలగటూరులోని ఏహెచ్ఏ కె. దేవనాయకి. కన్వీన ర్గా గంగవరం-3లో ఏఎన్ఎం,ె క. సుజాత ఎన్నికయ్యారు .ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జిల్లా సైనిక సంక్షేమ అధికారి మరియు జిల్లా సంఘం అధ్యక్షులు కె.వి. రాఘవులు,జిల్లా కార్యదర్శి కె.రమేష్, జిల్లా ఉపాధ్య క్షులులక్ష్మీపతి యాదవ్ స్వయంగా హాజరై నూతన కార్యవ ర్గాన్ని అభినందించారు. అలాగే పుంగనూరు ఏపీఎన్జీజీఓస్ అసోసియేషన్ అధ్యక్షుడు అలీఖాన్ ఎన్నికల అధికారిగా, సహాయ ఎన్నికల అధికారి సురేష్ బాబు వ్యవహరించారు ె గజిటెడ్,నాన్ గెజిటెడ్ పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హాజరై సం ఘానికి తమ మద్దతును ప్రకటించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల సాధనకే కొత్త కార్యవర్గం కట్టుబడి ఉందని నూతన అధ్యక్షులు ఆనందబాబు తెలిపారు.

# గంజాయి అన్న పదమే వినపడకూడదు

### ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి



నెల్లూరు పెన్ పవర్ నవంబర్ 30.కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి కోవూరు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులుఈరోజు శ్రీ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నివాసంలో పోలీస్ డిపార్ట్మెంట్ వారితో క్షుణ్ణంగా గట్టిగా ఒక విషయాన్ని చెప్పడం జరిగింది కోవూరు నియోజకవర్గంలో తల్లిదండ్రులకు కోవూరు నియోజ కవర్గాన్నికి చెడ్డ పేరు తెచ్చే ఏటువంటి అసాంఘిక కార్యకలా పాలనైన అణిచివేయాలని కోవూరు నియోజకవర్గాన్ని డ్రగ్స్ రహితంగా వివాదారహితంగా తీర్చిదిద్దాలని పోలీసులకు ఆదే శాలు జారీ చేయడం జరిగింది ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో గంజాయిఅన్న పదమే వినపడకూడదు (1)- యువతను పెడదారి పట్టించే గంజాయి నియంత్రణంలో పోలీసులకు పూర్తి స్వేక్ష. (2)- స్కూల్స్ మరియు అనుమానిత ప్రాంతాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయండి. (3)- గంజాయి తదితర మత్తు పదార్థాల సేవనం ద్వారా కలిగి అనర్ధాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయండి. (4)- గంజాయి రహిత సమాజం కోసం ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. (5)- తప్పు చేసిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దు. నియోజకవర్గ పరిధిలోని కోవూరు, బుచ్చి, కొడవలూరు సర్కిల్ ఇన్సపెక్టర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించిన కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

## గండికోట"కు కృష్ణారావు కవితా సాహితీ పురస్కారం



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్ 30. తెలుగు సాహితీ సేవలో తరిస్తూ, విద్యార్థులకు శతక పద్య పోటీలు నిర్వహిస్తూ, భాష, చరిత్ర, సంస్కృతి, సాంప్రదా యాలను అందరికీ తెలియజేస్తూ, తెలుగు మహాసభలలో కవితా గానం చేస్తున్న బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ రామచంద్రాపురం ఉపాధ్యాయులు, సాహితీవేత్త గండికోట సుధీర్ కుమార్ మండలి వెంకటకృష్ణారావు కవితా సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో అధికార భాష సంఘం ప్రథమ అధ్యక్షులు, శాసనసభ్యులు మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు శత జయంతి వేడుకలు మరియు కళా మిత్ర మండలి (తెలుగు లోగిలి) 19వ వార్షికోత్సవ సందర్భంగా సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి. లక్ష్మీనారాయణ, శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, దామంచెర్ల జనార్దన్ తదితరులు గండికోటకు అందజేసి అభినందించారు. మూడు దశాబ్దాలుగా తెలుగు వెలుగు కోసం నిరంతరం తపిస్తున్నారన్నారు. తెలుగు భాషకు సేవ చేసిన కవులు, రచయితల జీవిత చరిత్రలను విద్యార్థులకు వివరిస్తూ వారిలో స్ఫూర్తి నింపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళామిత్రమండలి జాతీయ అధ్యక్షులు నూనె అంకమరావు, తేళ్ళ అరుణ, సాహితివేత్తలు పాల్గొన్నారు.

## పౌర హక్కుల దినోత్సవం



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్ 30.:నాగ మాంబాపురం గ్రామం ఆదివారం రోజున పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామంలో ఎమ్మార్వో ఎంపీడీవో గారు డిప్యూటీ తాసిల్దారు ఎస్సీ హాస్టల్ వార్డును తదితర అధికారులు పాల్గొని పౌర హక్కుల అవగాహన కార్యక్రమం నిర్వహించినారు పౌర హక్కులు బాధ్యతలు మరియు ప్రభుత్వ సేవలపై గ్రామ ప్రజలకు సూచనలు అందిస్తూ గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుని త్వరగా పరిష్కరిస్తామని తెలిపినారు ఈ కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది గ్రామ నాయకులు గ్రామస్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకుగాను అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ ఇట్లు మండల ఉపాధ్యక్షులు వల్లూరు రాఘవరెడ్డి

## పోతిరెడ్డిపాలెం గ్రామ యువతకు క్రికెట్ కిట్ల పంపిణీ



% బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్ 30.కోవూరు మండల పరిధిలోని పోతిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం విపిఆర్ ఫౌండేషన్ , సౌజన్యంతో జొన్నవాడ దేవస్థానం చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ యువతకు క్రికెట్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తిరుమూరు అశోక్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం, శారీరక దారుఢ్యం పెరుగుతాయని చెప్పారు. క్రీడలు యువతను సానుకూల దారిలో నడిపిస్తాయని, భవిష్యత్తులో కూడా యువ అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి యద్దలపూడి, నాగరాజు, మాజీ సర్పంచ్ అంగిరేకుల కృష్ణ ప్రసాద్, దంపూరు శ్రీనివాసుల రెడ్డి, ఒట్టూరు వెంకటేశ్వర్లు. గ్రామ పెద్దలు, యువత పెద్ద ఎత్తున హాజరై తిరుమూరు అశోక్ రెడ్డికి మరియు విపిఆర్ ఫౌండేషన్కు కృతజ్ఞతలు తెలిపారు

## కలంకారి కళాకారుడు విజయ్ కుమార్ మృతికి సంతాపం తెలియజేసిన తలపా దామోదరం రెడ్డి



శ్రీ కాళహస్తి,పెన్ పవర్,నవంబర్ 30 :కలంకారి అధ్యాపకుడు మరియు కళా కారుడు విజయ్ కుమార్ మృతి వార్త విన్న వెంటనే వారి స్వగృహం వద్దకు వెళ్లి వారి పార్థివ దేహమునకు పూలమాలలు సమర్పించి, వారి కు టుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి.తలపా దామోదరం రెడ్డి మా ట్లాడుతూ విజయ్ కుమార్ కలంకారి కళ పట్ల మక్కువతో వారు ఆ విద్యను అభ్యసించి, ఆ విద్యపై ఎంతోమంది విద్యార్థులకు గురువుగా ఆ కళ ను నేర్పి ఆ కళ అభివృద్ధికి దోహదం పడ్డారు అని, వారు సుమారుగా ఐదు దశాబ్దాల పాటు కలంకారి కళ్ళకు సేవలందించారు అని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ పెంచలయ్య హత్యను ఖండిస్తూ కొవ్వొత్తుల నిరసన.

రేపటి జిల్లా బంద్‌ను జయప్రదం చేయండి.



కావలి: పెన్ పవర్ -(ఆర్సీ ఇంచార్జ్ )నవంబర్ 30:నెల్లూరు నగరం లో సీపీఎం పార్టీ నాయకులు కామ్రేడ్ పెంచలయ్యను గంజాయి ముకలు హత్య చేయడాన్ని ఖండిస్తూ రాష్ట్ర కమీటీ పిలుపు మేరకు ఆదివారం కావలి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ అంబేద్కర్ బొమ్మ వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల తో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ నెల్లూరు నగరం కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు దగ్గర ఆర్డిటి కాలనీలో కామ్రేడ్ పెంచలయ్య ఎంతో కాలము నుండి నివాసం ఉంటున్నాడని ఆ కాలనీలో గంజాయి ఇతర మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ యువతని చైతన్య పరుస్తూ యువత పెడదారి పట్టకుండా పనిచేస్తున్నాడని అంతేకాకుండా ప్రజా సమస్యలపై పని చేస్తూ ప్రజానాట్యమండలి కళాకారుడిగా సిపిఎం పార్టీ నాయకుడిగా ఉంటూ ముఖ్యంగా గంజాయి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నందున అది సహించలేని గంజాయి మూకలు శుక్రవారం రోజు పథకం ప్రకారం పెంచలయ్యను హత్య చేయడం చాలా దుర్మార్గమైన విషయమని ఇది పిరికి బంధాల చర్య అని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం గంజాయి ఇతర మాదక ద్రవ్యాలను అరికడతామని పదేపదే చెబుతూ ఇలాంటి సంఘటనలు జరగడం ఆశ్చర్యా నీ కలిగిస్తుందని అన్నారు. పెంచలయ్యను హత్య చేసిన రౌడీ మూకలను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం గంజాయి ఇతర మాదకద్రవ్యాలను ఇప్పటికైనా అరికట్టేందుకు గట్టి చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ హత్యను ఖండిస్తూ డిసెంబర్ రెండవ తేదీన జరుగు నెల్లూరు జిల్లా బంద్ లో ప్రజలు ప్రజాస్వామ్యవాదులు అందరూ పాల్గొని బంద్ ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి తిరుపాలు, బి కృష్ణయ్య, మేడ వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ నాయకులు పెంచాల నరసింహం, కె చెన్నయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్.కె హమ్ మద్, తోపాటు సిపిఎం ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు

### తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో
## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



' ఎమ్మెల్యే నెలవల.విజయశ్రీ "

'సూళ్లూరుపేట, పెన్ పవర్, నవంబర్ 30:నేడు దిత్వా తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తూ, వాగులు వంకలు ప్రవహిస్తున్న నేపథ్యంలో నియోజక వర్గం లోని ప్రజానీకం ప్రమాదాల బారిన పడకుండా అప్ర మత్తంగా ఉండాలని సూళ్లూరుపేట శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ సూచనలు చేశారు. ప్రధానంగా తీర ప్రాంతంలో ఉన్న గ్రామాల ప్రజలు రాష్ట్ర విపత్తుల శాఖ విడుదల చేసిన సలహాలు సూచనలు పాటించి ప్రాణా పాయం సంభవించకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. మత్స్యకారులు, మరి ఎవరైనా వేటకు వెళ్ళకూడదని, ఉధృతంగా ప్రవహించే వాగులు వంకలు నదులు దాటాలని ప్రయత్నించడం చేయకూడదని అన్నారు. ఎక్కడైనా ప్రమాదకరమైన పరిస్థితులు తలెత్తితే ఆయా మండల తాసిల్దార్, ఎస్ హెచ్ ఓ లకు సమాచారం అందించే సహాయం పొందాలని ఆదేశించారు.

### గంజాయి ముఠా దాడిలో
## మృతి చెందిన కామ్రేడ్ పెంచలయ్య



పలమనేరు,పెన్ పవర్, నవంబరు 30,గంజాయి ముఠా దాడిలో మృతి చెందిన కామ్రేడ్ పెంచలయ్య కు పట్టణ సిపిఎం కార్యదర్శి గిరిధర్ గుప్తా ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.ఆదివారంసిపిఎం పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ పెంచలయ్యకు ఆయన నివాళులు అర్పించి మాట్లాడుతూ.. నెల్లూరులో గంజాయి ముఠా బరితెగించిందని, గంజాయికి వ్యతిరేకంగా వివిధ కళారూపంతో ప్రజలను చైతన్య పరుస్తున్న యువ కళాకారులపై విరుచకబడిందని,తన పిల్లలతో కలిసి వస్తున్న పెంచలయ్య పై నడిరోడ్డు మీద గంజాయి ముఠా సభ్యులు దాడి చేయడమే కాకుండా కత్తిలతో వెంటాడి దారుణంగా హత్య చేశారన్నారు.శుక్రవారం సాయంకాలం జరిగిన ఈ సంఘటన నగరంలో కలకలం రేపిందని,ఒక పథకం ప్రకారమే గంజాయి ముఠాచేసిన ఈ హత్యలో ప్రజానాటక మండలి కళాకారుడు డి. వై.ఎఫ్.మాజీ నేత సిపిఎం కార్యకర్త కె పెంచలయ్య (37) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.మృతుడు పెంచలయ్య విద్యుత్ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతూ, నెల్లూరు రూరల్ ప్రజానాటిక మండల కార్యదర్శి బాధ్యతలు నిర్వహిస్తున్నారని,ఈ క్రమంలోనే నెల్లూరు నగరంలో ఇటీవల కాలంలో విచ్చలవిడిగా పెరిగిన గంజాయి సంస్కృతికి వ్యతిరేకముగా ఆయన ప్రజలను చైతన్యం పరచడానికి అనేక కళాకారుల రూపం నుంచి ప్రదర్శించాడని, అలాగే కొన్ని కార్యక్రమాలు కూడా చేశాడన్నారు.గంజాయి మానండోయ్ అని స్థానిక ప్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారన్నారు,ఇది స్థానిక గంజాయి ముఠాకు ఏమాత్రం నచ్చలేదని, బరితెగించి గంజాయి ముఠా హత్యకు పాల్పడిందని చాలా దారుణమని,ఈ ఈదాడిని సిపిఎం పార్టీగా వ్యతిరేకిస్తూ హత్య చేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే రాజా,జయంతి,అంజి, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు

# ఆ ఒక్కటి లేక మహిళ ఉద్యోగుల అవస్థలు

సిరిపురం గ్రామ సచివాలయ ఉద్యోగుల అవస్థలు వర్ణతీతం.-జిల్లా అధికారులు స్పందించాలని కోరుతున్న ఉద్యోగులు.





కావలి :పెన్ పవర్-( ఆర్సీ ఇంచార్జ్ ) నవంబర్ 30:అటు ఉద్యోగాల్లో.. ఇటు వ్యాపారాల్లో మగవారితో సమానంగా అన్ని రంగాల్లో అడుగులు వేస్తున్న మహిళలు ఇంకా అనేక ఇబ్బందులు పడుతున్నారు. కావలి రూరల్ మండలం పరిధిలోని సిరిపురం గ్రామంలో ఉన్న సచివాలయంలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం తొమ్మిది మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అందులో ఏడు మంది మహిళ ఉద్యోగులు ఉన్నారు. అయితే వీరికి మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడం ఇబ్బందులకు కారణమవుతోంది. అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతున్న ఆ గ్రామం సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళ ఉద్యోగులకు అవసరానికి ఆ ఒక్కటి కనిపించకపోవడంతో ఎటూ పాలుపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామంలోని సచివాలయానికి ప్రతినిత్యం అనేక పనుల నిమిత్తం ఎంతో మంది ప్రజలు వస్తుంటారు. దీంతో గంటల తరబడి అక్కడే ఉండాల్సి ఉంటుంది. దీంతో సచివాలయంలో పనిచేసే ఉద్యోగులకు కనీస సౌకర్యాలు కల్పన, మరుగుదొడ్లు లేకపోవడం బాధాకరమని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని సచివాలయంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని స్థానిక ఉద్యోగులు మరియు ప్రజలు, కోరుతున్నారు

# గివింగ్ హ్యాండ్స్ వృద్ధాశ్రమంలో అన్నదానం




శ్రీకాళహస్తి , పెన్ పవర్ ,నవంబర్ 30 : శ్రీకాళహస్తి పట్టణ శివారులోని బంగారమ్మకాలనీ వద్ద గివింగ్స్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఆదివారం తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ప్రొఫెసరు అముదవల్లి కుటుంబ సభ్యులు అన్నదానం చేయడంతో పాటు దుప్పట్లు పంపిణీ చేశారు. అముదవల్లి కుమారుడు జి.విఘ్నేష్ పీహెచ్ డీలో మొదటి ఫెలోషిప్ అందుకున్న సందనర్భంగా వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు ఈ సేవా కార్యక్రమాలు చేపట్టారు. అముదవల్లి, విఘ్నేష్ వృద్ధులతో కలిసి భోంచే శారు. వారి ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. వృద్ధుల తో ఆనందంగా గడిపి... వారి నుంచి శుభాశీస్సులు అందు కున్నారు. ఈ సందర్భంగా వృద్ధులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో గివింగ్ హాండ్స్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# దుర్గామాత ఆలయ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం



పలమనేరు,పెన్ పవర్, నవంబరు 30,నియోజకవర్గ పరిధి వి.కోట మండల కేంద్రంలో వెలసిన దుర్గామాత ఆలయ నూతన ధర్మకర్తగా రఘుపతి నాయుడు ఆదివారం అమ్మవారి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేశారు.అలాగే అమ్మవారి నూతన ధర్మకర్త మండలిలో కార్యవర్గసభ్యుల ప్రమాణ స్వీకారాన్ని ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర్ శర్మ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు.ఇందులో ముఖ్యంగా ఆలయ ధర్మకర్తగా రఘుపతి నాయుడు,ఉపాధ్యక్షులుగా కృష్ణారెడ్డి,నరసింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జగన్మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా రమేష్ బాబు, జనార్ధన్,బాలాజీ, కోశాధికారిగా తుకారం, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, కార్యనిర్వాహక సభ్యులుగా శివకు మార్, రాజేష్ బాబు,కార్తీక్, మహేష్,ప్రతాప్ రెడ్డి శివరంజని,తేజ, రాజబాబు,ఏ.కృష్ణ, చంద్రశేఖర్(చక్రి), శ్రీనివాసులు,వెంకటేష్, మాధవ్,సతీష్,గణేష్, లోకేష్,భరత్,హరీష్, సలహా మండలి సభ్యులుగా ఏ.ఎం. రంగనాథ్,సి.రామచంద్ర నాయుడు,కే. యువరాజ్,జి.శ్రీనివాసులు,సి.వి. ఆనందరెడ్డి,సి శ్రీనివాసులు, బి.విజయ్ కుమార్ రాజు,వెంకటరామప్ప,సి. విశ్వేశ్వరయ్య, డి.వి. భక్తవత్సలం, పి.నాగభూషణం, పార్థ సారథి,కమల్ రాజు తదితరులు అమ్మవారి ఎదుట ప్రమాణ స్వీకారం చేశారు.ఈసందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. రానున్న కాలంలో అమ్మవారి జాతర వైభవాన్ని దశదిశలా వ్యాపింప చేసేందుకు నూతన పాలకవర్గం అహర్నిశలు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు

# బొలెరో ప్రమాద ఘటనలో 4కు చేరిన మృతుల సంఖ్య

13 రోజుల పాటు కోమాలో ఉండి చేబ్రోలు హాజరత్తయ్య మృతి బట్లదిన్నె గ్రామంలో విషాదఛాయలు



కావలి :పెన్ పవర్ -(ఆర్సీ ఇంచార్జ్) నవంబర్ 30:బతుకు దెరువు కోసం కూలి పనులకు వెళ్తూ మృత్యుఒడికి చేరిన వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. అల్లూరు మండలం సింగపేట సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గత 13 రోజులుగా మృత్యువుతో పోరాడుతున్న క్షతగాత్రుడు ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. దీంతో ఈ ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య నాలుగుకు చేరింది.వివరాల్లోకి వెళితే కావలి మండలం బట్లదిన్నె గ్రామానికి చెందిన భవన నిర్మాణ కూలీలు నవంబర్ 17న పనుల నిమిత్తం బొలెరో వాహనంలో వెళ్తుండగా, అల్లూరు మండలం సింగపేట వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడిన విషయం విదితమే. ఈ దుర్ఘటనలో బండ్ల ప్రసాద్, ఉప్పాల సీనయ్య అనే ఇద్దరు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.ప్రమాదంలో తీ వ్రంగా గాయపడిన వారిని నెల్లూరు ఆస్ప త్రులకు తరలించగా, చికిత్స పొం దుతూ మూడు రోజుల అనంతరం తాళ్లపాలెం గ్రామానికి చెందిన నాగరాజు మృతి చెం దారు. ఇదే ప్రమాదంలో తలకు బలమైన గాయాలై కోమాలోకి వెళ్లిన సి.హెచ్. హాజరత్తయ్య (37) నెల్లూరులోని ఆసుపత్రిలో 13 రోజుల పాటు ప్రాణాలతో పోరాడారు. పరిస్థితి విషమించడంతో నవంబర్ 30 తెల్లవారుజామున ఆయన కన్నుమూశారు. కు టుంబ పెద్దను కోల్పోవడంతో హాజరత్తయ్య కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఒకే గ్రామానికి చెందిన వారు వరుసగా మృత్యువాత పడటంతో బట్లదిన్నెలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ దుర్ఘటనలో రెక్కాడితే డొక్కాడని కూలీల మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు

### దిత్వా తుఫాన్ పట్ల ప్రజలు
## అప్రమత్తంగా ఉండాలి

తెదేపా సీనియర్ నాయకులు గాలి మురళి నాయుడు



శ్రీకాళహస్తి,పెన్ పవర్,నవంబర్ 30 :తొట్టంబేడు మండలం లో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే రైతులు నష్టపోయారని,వార్తల్లో తుఫాన్ ప్రభావం పుధిచ్చేరి దాటి చెన్నై మీదుగా తిరుపతి, చిత్తూరు మీద ఎక్కువ ప్రభావం ఉన్నందున,రైతులు వ్యవసాయ పొలాల్లో మోటార్ల వద్దకు ,ట్రాన్స్ఫార్మర్ల వద్దకు చెట్ల క్రింద తలదాచుకోవద్దని ఎక్కువగా పది కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షం ఉందని వాతావరణ శాఖ తెలియజేయడంతో పిల్లలను స్కూలుకు పంపకుండా,వర్షంలో తడవకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని, మండలంలో తెలుగు గంగ కాల్వ ప్రవాహం ఉధృతంగా ఉన్నందున జాగ్రత్త వహిం చాలని ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగిన,ఎడల పార్టీలకతీతంగా శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి కి,గ్రామ నాయకులకు ముఖ్యంగా సచివాలయ సిబ్బందికి, మండల అభివృద్ధి అధికారికి, ఇరిగేషన్ అధికారులకు, మండల రెవెన్యూ అధికారులకు, అన్ని శాఖల అధికారులకు, మండల నాయకులకు తెలియజేయాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గాలి మురళి నాయుడు తెలియజేశారు

## తెలుగు సాహిత్యంలో నిలిచిపోయే అద్భుతమైన కథ సాగేటి సాళ్లలో..విలక్షణ రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి



పలమనేరు,పెన్ పవర్,నవంబరు 30,:ప్రముఖ కథా నవల రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి కథ నాగేటి సాళ్ళల్లో.. వస్తువు శైలి శిల్పం కథా కథనం అద్భుతం అని పలమనేరు రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు ఆర్.మాధవ్ అన్నారు.తెలుగు సాహిత్య చరిత్రలో చిరకాలం నిలిచిపోయేరచనలను జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి అందించారని ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ కవితశ్రీ అన్నారు. మానవుడి అస్తిత్వానికి సంబంధించి విలువైన చర్చనీయ అంశాలను ఈ కథలో రచయిత చర్చించారని ఆయన అన్నారు.ఈ కథ ద్వారా యువ రచయితలు వస్తువు శైలి శిల్పం కథా కథనం కంఠస్వరం ఇతర అంశాలకు సంబంధించి మెళకువలను నేర్చుకోవచ్చని ఆయన తెలిపారు.ఆదివారం గంగవరం మండల కేంద్రంలోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరంలో జరిగిన వర్తమాన తెలుగుకథ చర్చా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ఆర్ మాధవ్ అధ్యక్షత వహించగా,ప్రముఖ సీనియర్ కథా రచయిత టి.ఎస్.ఏ.కృష్ణమూర్తి, జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షులు మితాయి యుగంధర్ బాబు, ఉపాధ్యాయ నాయకులు గంటా మోహన్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు తులసి నాథం నాయుడు,పుష్పఈ చర్చా కార్యక్రమానికి సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. రచయితలు దోర్నాధుల సిధార్థ, బ్రహ్మంస, ఆనంద తీర్థరావు, శ్రీపురం సీతారామయ్య, భగవద్గీత బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## గార్డ్స్ ఆధ్వర్యంలో మహాకవి గురజాడ అప్పారావు 110వ వర్ధంతి కార్యక్రమం



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 30 :చిలకలూరిపేట: పట్టణంలోని వెనకబడిన తరగతుల బాలుర హాస్టల్ లో ఆదివారం జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో మహాకవి గురజాడ అప్పారావు 110వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ప్రముఖ సాహితీ విమర్శకులు పీవీ సుబ్బారావు పాల్గొని గురజాడ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. కొన్ని గురజాడ గేయాలు పాడి వినిపించారు. అనంతరం విద్యార్థులకు కథల పుస్తకాలు ఉచితంగా అందజేసి, వారిచే చదివించి పఠనాసక్తి కలిగించారు. తొలుత గురజాడ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రచురణల విభాగం కన్వీనర్ దార్ల బుజ్జిబాబు, హాస్టల్ వార్డన్ కృపవతి, రవికిరణ్ తదితరులున్నారు.

పెన్ పవర్
తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు
గుంటూరు । బాపట్ల । పల్నాడు

# దిత్వా తుపాను హెచ్చరిక నేపథ్యంలో భారీ వర్షాలకు ముంపునకు గురయ్యే గ్రామ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**

పెన్ పవర్, నవంబర్ 30,అద్దంకి : నియోజకవర్గంలోని అద్దంకి మండలం, కొరిశపాడు మండలాలలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదివారం విస్తృతంగా పర్యటించారు. నియోజకవర్గం లోని కొరిశపాడు మండలం మేదరమెట్ల రెవిన్యూ గ్రామం పరిధిలోని తిమ్మనపాలెం గ్రామ చెరువును పరిశీలించారు. 95 శాతం నిండుగా చెరువు ఉండడంతో భారీ వర్షాలకు చెరువు కట్ట తెగకుండా ముందస్తుగా బలోపేతం చేయాలన్నారు. చెరువు లోపలకు నీటి ప్రవాహం వచ్చే మార్గంలో పూడికతీత యుద్ధ ప్రాతిపదికను తొలగించాలన్నారు. వర్షాలకు చెరువు నిండితే వెలుపలకు వెళ్లే మార్గం సరి చేయాలన్నారు. జాతీయ రహదారికి ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు ప్రాంతమైన అద్దంకి మండలం దేనువకొండ గ్రామాన్ని కలెక్టర్ పరిశీలించారు. అద్దంకి మండలం గాజులపాలెం సచివాలయాన్ని తనిఖీ చేశారు. విపత్తు నిర్వహణ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. పంట కాలువలో పూడికతీత, గుర్రపు డెక్క తొలగించడానికి జెసిబి యంత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. జనరేటర్లు, చెట్లు తొలగించడానికి తదితరమైన యంత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. అధిక వర్షపాతం నమోదైతే దేనువకొండ గ్రామంలో కొన్ని గృహాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, వారిని యుద్ధ ప్రాతిపదికన తరలించడానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటికే దేనువకొండలో గుర్తించిన ప్రాథమిక పాఠశాల పునరావాస కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పునరావాస కేంద్రంలో వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తక్షణమే విద్యుత్ దీపాలు, నీటి వసతి తదితరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాలపై ఆరా తీశారు. ఏయే ప్రాంతాలలో వరద నీరు వస్తుందని అంశాలపై సంబంధిత శాఖల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత తుపాను సమయంలో గుండ్లకమ్మ నదికి 90 క్యూసెక్కుల నీరు వచ్చిందని ఇంజినీరింగ్ అధికారులు





కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురిస్తే చిలకలేరు, దోర్నపువాగులు పొంగి పొర్లిపారే అవకాశం ఉందని, ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. చెరువుకొమ్ముపాలెం చప్టా వద్ద వర్షపు నీరు అధికంగా వచ్చే అవకాశం ఉందని, సమీప ప్రాంతాల వారిని అప్రమత్తం చేయాలని అధికారులను కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. అద్దంకి పట్టణంలో నీరు నిలిచే కాలనీలలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వీఆర్వోలు, వీఆర్ఏలను ఆయా చెరువులు, కాల్వల చప్టాలు, గట్ల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. చెరువు కట్టలు బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, సమీపంలోని ప్రజలను చైతన్యపరిచడం, అప్రమత్తంగా ఉంచాలని ఆయన సూచించారు. అనంతరం ముంపునకు గురయ్యే బాధిత కుటుంబాలకు పునరావాస కాలనీలో నివాస స్థలాలు ఇవ్వాలి, మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు కలెక్టర్ కు విన్నవించుకున్నారు.ఈ కార్యక్రమం లో చీరాల ఆర్డిఓ టి చంద్రశేఖర్, మునిసిపల్ కమిషనర్, తహసిల్దార్ చరణ్, జల వనరుల శాఖ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు .ల



## ఆరోగ్యకర సమాజం అందరి బాధ్యత.. ఎమ్మెల్యే నసీర్..



పెన్ పవర్, గుంటూరు, నవంబర్, 30.:కేర్ వెల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంనేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ చైతన్యం కలిగి ఉండాలని, వ్యాధికి గురి కాకముందే జాగ్రత్తలు తీసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం గుంటూరులోని పామ్ స్ప్రింగ్స్ లో కేర్ వెల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని రోగాలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సఖీ-సురక్ష కార్యక్రమం ద్వారా మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ వ్యాప్తంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వంతోపాటు ప్రైవేటు వైద్యులు ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కేర్ వెల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ షేక్ నాగూర్ బాషా పేదలకు వైద్య శిబిరాలు ఉచితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తే తమ వంతు సహకారం అందిస్తామని సూచించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పామ్ స్ప్రింగ్స్ అపార్ట్ మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట్రావు, వైస్ ప్రెసిడెంట్ పెరవలి సుబ్బారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తుఫాను సందర్భంగా రైతులను అప్రమత్తం చేయాలి..

**తహసిల్దార్ ఎం శ్రీనివాసరావు**



భట్టిప్రోలు, పెన్ పవర్ నవంబర్, 30:తుఫాను వల్ల రైతులను అప్రమత్తం చేయాలని భట్టిప్రోలు మండల తహసిల్దారు ఎం శ్రీనివాసరావు అన్నారు. తుఫాను నేపథ్యంలో స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది వీఆర్వోలతో తాసిల్దారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేర మండల పరిధిలోని రైతులు వరి.కోతలను కోయకుండా నిలుపుదల చేయాలన్నారు. వరి కోతలను పూర్తి చేసి గుడ్లు



ఆరబోసిన రైతులు ధాన్యాన్ని జాగ్రత్త పంచుకోవాలన్నారు. ఆరుదల అయిన ధాన్యాన్ని రేపల్లెలోని రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భట్టిప్రోలు మెయిన్ డ్రైన్, వెల్లటూరు సైడ్ డ్రైన్ లను వీఆర్వోలతో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. నీటిపారుదలకు డ్రైన్ లో ఎటువంటి అడ్డంకులు లేవని ఆయన తెలిపారు. సమావేశం అనంతరం భట్టిప్రోలు వెల్లటూరు ,పెదపులివర్రు,పల్లికోన,సూరేపల్లి, ఓలేరు గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో ఆయన రైతులతో మాట్లాడారు. వీరితోపాటు మండల వ్యవసాయ అధికారి బి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

# 'హీరో" అనే పదం డ్రగ్ కంటే ప్రమాదకరం చర్యలు తీసుకోండి! ..

**సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్-రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ**

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 30 :

చిలకలూరిపేట : "హీరో" ఆరాధన వలన బాల్య దశ నుండి మన యువత భవితకు నష్టం వాటిల్లుతున్నదని, "హీరో" పదం డ్రగ్ కంటే ప్రమాదకరంగా మారిందని చట్టపరంగా తగు చర్యలు తీసుకోవాలని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ వ్రాశారు. సినిమాలో నటించే వారిని లీడ్ యాక్టర్, లీడ్ యాక్ట్రెస్ అని కాకుండా హీరో అనే పదం వాడటం వలన హై స్కూల్ స్థాయి నుండి కాలేజీ విద్యార్థుల వరకు అందరి మానసిక స్థితి పై తీవ్రమైన ప్రభావం చూపుతుందని లేఖలో పేర్కొన్నారు. ఆ కారణం చేత మన యువత విలువైన సమయాన్ని, బంగారు భవిష్యత్తుని పాడు చేసుకుంటున్నారని, సినిమాలో నటించే నటులు అభినయించే పాత్రలను బట్టి "కథానాయక పాత్రధారులు" లేక "హీరో పాత్రధారి" అని సంబోధించడానికి బదులుగా, నేటి ఎంటర్టైన్మెంట్ మీడియా "హీరో" అనే పదం ఉపయోగిస్తున్నారని అన్నారు. అంతేకాకుండా, సినిమాలోని లీడ్ యాక్టర్స్ వాళ్లకు వాళ్లే బిరుదుగా ఏదో ఒక స్టార్ అని పెట్టుకోవడం పరిపాటిగా మారిందని అన్నారు. విద్యార్థులు హై స్కూల్ స్థాయి నుండి నటీనటులను మరి ముఖ్యంగా హీరో పాత్రధారులను ఆరాధ్యులుగా భావిస్తున్నారనే విషయాన్ని గుర్తించడానికి మనకి చాలా ఉదాహరణలు చెప్పుకోవచ్చు అని అన్నారు.దేశం కోసం ప్రాణాలర్పించే సైనికుల కంటే, దేశానికి అన్నం పెట్టే రైతన్నల కంటే, తల్లిదండ్రుల కంటే ఆర్టిస్టుల ఎంతో గొప్ప వాళ్ళుగా చూస్తున్నారని అన్నారు. కథానాయక పాత్రధారులకి 200 కోట్లు, 300 కోట్లు రెమ్యూనరేషన్ కారణం చేత సినిమా ఖర్చు పెరిగిపోతుందని గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టకుండా, పది రూపాయల మొక్కజొన్న పేలాలు వేయించి సగటు ప్రేక్షకుడి దగ్గర రూ. 600/- వరకు వసూలు చేస్తున్నారని అన్నారు. అందువలన సగటు ప్రేక్షకుడు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు.సినిమా ఖర్చు పెరగడానికి ప్రధాన కారణమైన ప్రధాన పాత్రధారుల వేతనాలతో పాటు ఇతర పాత్రధారుల వేతనాలను నిర్ణయించుటకు పరిశ్రమ నిబంధనలను పాటించే విధంగా విధివిధానాలను ప్రభుత్వము రూపొందించి అమలు చేయాలి. ఈ విధివిధానాల అమలుపై పర్యవేక్షణ స్థాయి అధికారులతో కూడిన సంస్థలను ఏర్పాటు చేయాలి. ఎంటర్టైన్మెంట్ మీడియా క్రియేట్ చేసిన హైప్ వలనే కథానాయక పాత్రధారులు 200 కోట్లు, 300 కోట్లు ఒక్కొక్క



సినిమాకు తీసుకుంటున్నారు. ఐబొమ్మ సినిమా పైరసీ చట్ట ప్రకారం నేరం అయినప్పటికీ సామాన్య ప్రజలు రవినిఎంతలా అభిమానిస్తున్నారో మనం చూస్తున్నాం. ఇప్పటికైనా ఎంటర్టైన్మెంట్ మీడియాలో కథానాయక పాత్రధారులు లేదా హీరో పాత్రధారి అని మాత్రమే సంబోధించే విధంగా చర్యలు తీసుకోవాలి. "హీరో" అనే పదం వాడటం ఆపాలని, అంతేకాకుండా నటులు వాళ్లకై వాళ్ళు పెట్టుకున్న స్టార్ అనే పదాలను పత్రికల్లోను, ఎంటర్టైన్మెంట్ మీడియాలో నియంత్రించాలని కోరారు. థియేటర్లోకి కనీస అవసరాలు డ్రింకింగ్ వాటర్, బిస్కెట్స్ లాంటి స్నాక్స్ అనుమతించాలని, లేదా ఎమ్మార్పీ రేట్లుకు, డ్రింకింగ్ వాటర్, బిస్కెట్స్, స్నాక్స్ (ఐ ఎస్ ఐ ధ్రువీకరించిన) అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనల ప్రకారం వెహికిల్ స్టాండ్స్ లో రుసుము వసూలు చేయరాదు. కానీ, ఆ నిబంధన ఎక్కడ అమలు కావడం లేదు, అమలు జరిగేలా చూడాలని, వెహికల్ స్టాండ్ లో రుసుము చెల్లించనవసరం లేదు అని బోర్డులు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఇప్పటికైనా ఆ దిశగా పటిష్టమైన చట్టాలు తీసుకురావాలని, తద్వారా యువత భవిత అభివృద్ధి వైపు అడుగులు వేయడానికి మార్గం సుగమం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్, మురకొండ వెంకట్రావు, వెంకటేశ్వర్ రెడ్డి, అడపా రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి-ఎస్ఎఫ్ఐ..

పెన్ పవర్, గుంటూరు, నవంబర్, 30.:స్థానికంగా ఉన్నటువంటి గుంటూరు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా 50 వ మహ సభ జరిగింది.ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కళాధర్ .ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశంలో ఆర్థిక సంస్కరణ తర్వాత ఉన్నత విద్యారంగంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఉన్నత విద్యారంగం పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ జరుగుతుంది. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్లో 17 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. యూనివర్సిటీలో గత 15 ఏళ్ల గారి రిక్రూట్మెంట్ లేకపోవడం తో అకాడమిక్ క్షీణత ప్రారంభమైనది .ప్రొఫెసర్లు ,అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు ప్రస్తుతం నాలుగు వేల పైగా ఖాళీలు ఉన్నాయి. కొన్నిచోట్ల కాంట్రాక్ట్ గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో అధ్యాపకులు పనిచేస్తున్నారు. విశ్వవిద్యాలయాల నిర్వహణ లోపభూయిష్టంగా ఉన్నది. వైస్ ఛాన్సర్ , ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్ నియామకం పూర్తి రాజకీయ కోణంలో నే జరుగుతూ అకాడమిక్ నిపుణతకు ప్రాధాన్యత లేకుండా పోయింది. రాష్ట్రంలో బ్రౌన్ ఫీల్డ్ యూనివర్సిటీల పేరుతో గీతం, కోనేరు లక్ష్మయ్య ,విజ్ఞాన్, వీట్, ఎస్ఆర్ఎం , అమృత, మోహన్ బాబు,అపోలో మొదలైన ప్రైవేట్ డీమ్డ్ యూనివర్సిటీలు పనిచేస్తున్నాయి యూనివర్సిటీలలో టెక్నాలజీ కోర్సులు మాత్రమే ఉంటాయి .రిజర్వేషన్లు ఉండవు ఫీజుల పై




చేర్చుకునే విద్యార్థుల సంఖ్య పై పరిమితి లేదు ప్రభుత్వ నియంత్రణ లేదు. రాష్ట్రంలో గల 280 ఇంజినీరింగ్ కాలేజీలు, 200 ఎంబీఏ ,ఎంసీఏ కాలేజీలు 150 ,బి ఫార్మసీ కళాశాలలో 90% ప్రైవేట్ కాలేజీలో వీటిలో విద్యా ప్రమాణాలపై తనిఖీ యంత్రాంగం లేదు. అంతేకాకుండా రాష్ట్రంలో 1353 డిగ్రీ కాలేజీల్లో 1080 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు 152 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉండగా అందులో 57 డిగ్రీ కాలేజీలుగా ఉన్నాయి రాష్ట్రంలో ఎంతో చరిత్ర కలిగిన ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలు ప్రభుత్వా అనుసరిస్తున్న విధానం ఫలితంగా గత రెండు సంవత్సరాల్లో అన్ ఎయిడెడ్ కాలేజీలుగా 70 కాలేజీలు మారాయి. మిగిలిన 50 ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల్లో కొద్ది సంఖ్యల్లో మాత్రమే ఎయిడెడ్ సిబ్బంది గా ఉన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులు పనిచేయటం తగిన మౌలిక వసతులు లేకపోవడం వల్ల చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతున్నది. పేద విద్యార్థులు ముఖ్యంగా దళితులు గిరిజన బీసీ విద్యార్థులు ఫీజు రియంబర్స్మెంట్ సమస్యలు ఎదుర్కొంటున్నారు జీవో నెంబర్ 77 జారీ చేసి డిగ్రీ తర్వాత పిజి కోర్సులు ప్రైవేటు సంస్థల్లో చేస్తే ఫీజు రియంబర్స్మెంట్ ఉండదు అని ప్రకటించటంతో వేలాదిమంది విద్యార్థులు నష్టపోతున్నారు. జీవో నెంబర్ 77 రద్దుచేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల్లో ఖాళీలన్నిటిని భర్తీ చేయాలి యూనివర్సిటీలో విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. ప్రైవేటు యూనివర్సిటీలపై నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పరచాలి. డిగ్రీ కళాశాలలను పటిష్ట పరచాలి. జీవో నెంబర్ 77ను రద్దు చేయాలి. సామాజిక,మానవీయ,జీవశాస్త్రాలకు ప్రాధాన్యత కల్పించే విధంగా చర్యలు చేపట్టాలి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రమాణాలు మెరుగుపరచాలి. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె ప్రసన్నకుమార్, ఎస్ఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం కిరణ్, మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భావనారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కృష్ణ కాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్. సమీర్,జిల్లా అధ్యక్షులు కె పవన్ కుమార్, సహయ కార్యదర్శి అన్సారీ, కిరణ్ దాసరి, అమృత వర్షిని, ఉపాధ్యక్షులు సౌమ్య, రూపాస్, కమిటీ సభ్యులు యశ్వంత్, సుర్జిత్, అజయ్, అభిలాష్, అనిల్,తదితర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## సఖి రక్ష సఖి సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించిన.. ఎమ్మెల్యే గళ్ళా మాధవి..



పెన్ పవర్, గుంటూరు, నవంబర్, 30.:గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 24వ డివిజన్ చుట్టుగుంట పోలేరమ్మ తల్లి దేవస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, మెప్మా ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'సఖి రక్ష %-% సఖి సురక్ష' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...మహిళల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి డ్వాక్రా మహిళ ఆరోగ్య భద్రత కోసం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో, 35 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు, 55 ఏళ్ళు పైన వయసున్న మహిళలకు ప్రత్యేకంగా, మూడు రోజులపాటు విస్తృత స్థాయి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.క్యాన్సర్లు, రెస్పిరేటరీ సమస్యలు, షుగర్, లైఫ్ స్టైల్ డిసార్డర్స్, ఎనీమియా వంటి మహిళలు ఎక్కువగా ఎదుర్కొనే ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టి 14 రకాల ముఖ్యమైన హెల్త్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఒక వారం రోజుల్లో ప్రతి మహిళకు వ్యక్తిగత హెల్త్ కార్డు ఇచ్చి, ఏదైనా ఆరోగ్య సమస్యలు కనపడితే నేరుగా ప్రభుత్వం హాస్పిటల్కి రిఫర్ చేసి పూర్తి స్థాయి ఫాలోఅప్, చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.అదే విధంగా ఆయుష్మాన్ భారత్ కింద ప్రతి మహిళకు ?5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం అందుబాటులో ఉండటం ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.డ్వాక్రా మహిళల స్వయం సాధికారత కోసం ఈ పథకం మరో భారీ అడుగుగా నిలుస్తుందని, ప్రతిరోజూ కనీసం 600మందికిటెస్టులు ట్రీట్మెంట్లు అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం ఒక సంవత్సరం పాటు కొనసాగుతుందని, ఇప్పటికే సఖి సురక్ష టీంను ఏర్పాటు చేసే ప్రక్రియ మొదలైందని, టెస్టులు చేసిన ప్రతి మహిళకు పూర్తిస్థాయి చికిత్స అందించేందుకు ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు

## ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు ని మర్యాదపూర్వకంగా కలిసిన..ఆళ్ళ హరి..



పెన్ పవర్, గుంటూరు నవంబర్,30.:దేశం పట్ల అవిరళ భక్తి , సమాజం పట్ల బాధ్యత , ప్రజల పట్ల ప్రేమ మెండుగా కలిగిన జనసేన పార్టీ అధ్యక్షులు , రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ లాంటి నాయకుడితో కలిసి ప్రయాణం చేయటంతో తన జన్మ చరితార్ధక మైందని జనసేన పార్టీ ప్రోగ్రామింగ్ కమిటీ చైర్మన్ , ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు అన్నారు. నూతనంగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన కళ్యాణం శివ శ్రీనివాసరావుని శనివారం జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి మర్యాదపూర్వకంగా కలిసి దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఒక మహోన్నతమైన ఆశయంతో జనసేనని స్థాపించాం న్నారు. దేశ సంక్షేమమే జనసేన ప్రధాన లక్ష్యమన్నారు. జనసేన పార్టీలో ఉండటం ప్రతీ ఒక్కరికీ గర్వకారణమన్నారు. కష్టపడిన ప్రతీ ఒక్కరికీ పవన్ కళ్యాణ్ మనసులో ప్రత్యేక స్థానం ఉంటుందని వ్యాఖ్యానించారు. పదవులను ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహిస్తామన్నారు. ఈ పదవి ద్వారా తనకు మరింత బాధ్యత పెరిగిందని అధినేత పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు పునరంకితమవుతామని శివ శ్రీనివాస్ అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో వీర మహిళ కటకంశెట్టి విజయలక్ష్మి మిద్దె నాగరాజు , వడ్డే సుబ్బారావు , ఆనంద్ సాగర్ , సోమి ఉదయ్ , నవీన్ , పసుపులేటి నరసింహారావు , మాదాసు శేఖర్ , దాసరి వెంకటేశ్వరరావు , శానం రమేష్ , షర్ఫుద్దిన్ , పులిగడ్డ నాగేశ్వరావు , కన్నా రాజేష్ , పోకల కిరణ్ , శ్రీకాంత్ , ఏడుకొండలు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## దిత్వా తుపాను ప్రభావం దృష్ట్యా గుంటూరు జిల్లా పోలీస్ శాఖ తరపున కంట్రోల్ రూములు ఏర్పాటు.. ఎస్పీ వకుల్ జిందల్..





పెన్ పవర్, గుంటూరు, నవంబర్, 30.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడానికి, వారికి సహా యక చర్యలు అందించటానికి గుంటూరు జిల్లా జిల్లాలోని ప్రతి పోలీస్ సబ్ డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి, నిరంతరపర్యవేక్షణ కొరకు పోలీస్ అధికారులు సిబ్బందిని నియమించాం.పోలీస్ సబ్డివిజన్ల వారీగా కంట్రోల్ రూమ్ నంబర్లు:ఈస్ట్ సబ్డివిజన్ %- 0863-2223353వెస్ట్ సబ్డివిజన్ %- 0863-2241152 / 0863-2259301నార్త్ సబ్డివిజన్ %- 08645-237099సౌత్ సబ్డివిజన్ %- 0863-2320136 తెనాలి సబ్డివిజన్ %- 08644-225829 తుళ్లూరు సబ్డివిజన్ %- 08645-243265జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్: 0863-22301తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ప్రమాదకర వంతెనలు, బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద పోలీసిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశాం.ప్రధాన రహదారులు, బృందాలను నియమించాం.ప్రజలు కూడా అత్యవసరమైతే తప్ప గృహాల నుండి బయటకు రాకుండాపోలీస్వారికిసహకరించాలని తరఫున తుఫాన్ ప్రభావిత ప్రాంతాలు, ముంపు సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ అన్ని స్థాయిల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయబడ్డాయి.

### నగరంలో అభివృద్ధి పనులు నిర్వహించిన

## అనంతరం నిర్మాణ వ్యర్థాలను సంబంధిత కాంట్రాక్టర్ తొలగించాలి..

**కమిషనర్ పులి శ్రీనివాసులు. .**



పెన్ పవర్, గుంటూరు, నవంబర్, 30.:ఆదివారం కమిషనర్ పెదపలకలూరు, రత్నగిరి కాలని, అరండల్ పేట తదితర ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి పనులను మరియు సదరు ప్రాంతాలలో పారిశుధ్య పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యల పై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ పేద పలకలూరు, రత్నగిరి కాలనీ మరియు అరండల్ పేటలలో పర్యటించి, సదరు ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న సైడు కాలువలు మరియు రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, పనులు జరుగు సమయంలో ఎమినిటి కార్యదర్శులు పనులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు పూర్తైన అనంతరం నిర్మాణ వ్యర్థాలను పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ తప్పని సరిగా తొలగించేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాల న్నారు. అభివృద్ధి పనులు పూర్తైన తరువాత వ్యర్థాలను అక్క డే వదిలేస్తున్నారని ప్రజల నుండి పిర్యాదులు వస్తున్నాయని, సదరు వ్యర్థాల వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం సదరు ప్రాంతాలలో పారిశుధ్య పనులను తనిఖీ చేసి, డోర్ టు డోర్ చెత్త సేకరణ నూరు శాతం తడి పొడి చేత్తలుగా విభజించి జరగాలన్నారు. మధ్యాహ్నం పూట తప్పనిసరిగా సైడు కాలువలను శుభ్రం చేయించాలని, సైడు కాలువలు శుభ్రం చేయుటకు ఆక్రమణలు ఏమైనా అడ్డుగా ఉంటె వాటిని తొలగించి, కాలువలను శుభ్రం చేయించాలన్నారు. ప్రజలు వ్యర్థాలను కాలువల్లో మరియు రోడ్ల పై వేయకుండా తడి పొడి వ్యర్థాలుగా విభజించి నగర పాలక సంస్థ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని తెలియ చేశారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నా

## భట్టిప్రోలు గ్రామ అభివృద్ధికి మంజూరైన నిధులు..తూనుగుంట్ల సాయిబాబా




భట్టిప్రోలు, పెన్ పవర్ నవంబర్,30:మేజర్ పంచాయతీగా భట్టిప్రోలు గ్రామ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయటం జరిగిందని రాష్ట్ర తెలుగు దేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. భట్టిప్రోలు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుల,కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం పార్టీ సీనియర్ అభిమాని కుంచె వెంకటేశ్వరరావు అధ్యక్షతన స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆవరణలో జరిగింది.ముఖ్య అతిథిగా పాల్గొన్న సాయిబాబా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 17 నెలల కాలంలో రాష్ట్ర మాజీ మంత్రి,వేమూరు శాసనసభ్యులు నక్క ఆనందబాబు ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలు నిధులు మంజూరై గ్రామంలోని పలు అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని అన్నారు. గత ఐదేళ్ల క్రితం రాష్ట్రంలో అధికారం చేపట్టి పరిపాలించిన వైసిపి ప్రభుత్వం ఏనాడు ఐదు సంవత్సరాల కాలంలో గ్రామ అభివృద్ధికి నిధులు అతి తక్కువ గా మంజూరయ్యాయ న్నారు. ఎమ్మెల్యే ఆనందబాబు సహకారంతో విఠలేశ్వర నగర్ లో సిసి రోడ్ల నిర్మాణానికి 40 లక్షలు, అద్దేపల్లి దళితవాడలో రెండు సిమెంట్ రోడ్లకు 10 లక్షలు, రైల్వే రైలు పేట దళితవాడ లో సీసీ రోడ్ల నిర్మాణానికి 10 లక్షలు అదేవిధంగా మొత్తం రెండు కోట్ల రూపాయలు అభివృద్ధి పనులకు మంజూరయ్యాయి అన్నారు. అదేవిధంగా నిర్మాణాలు చేయవలసిన పనులకు మరో రెండు కోట్లు మంజూరయ్యాయి అన్నారు. గ్రామంలో కొత్తగా విద్యుత్తు లైనులకు మరియు స్తంభాల మార్పిడికి మరో కొంత మేర నిధులు మంజూరయ్యాయని సాయిబాబా పేర్కొన్నారు. భట్టిప్రోలు గ్రామంలో అన్నదాత సుఖీభవ పథకం కింద అనేక మంది రైతులకు మేలు చేకూరిందన్నారు. గత సంవత్సరం నాట్లు సమయంలో అధిక వర్షాలకు నష్ట పోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ కింద ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. దేవాదాయ శాఖలో భూములను కవులు పద్ధతిపై పార్టీ కార్యకర్తలకు ఆనందబాబు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన షాపులను ఎవరికి ఇబ్బంది లేకుండా ఉన్నవారికి ఆ షాపులను రెన్యువల్ చేయటం జరిగిందని సాయిబాబా పేర్కొన్నారు. అదేవిధంగా ఇంటి స్థలాలు మరియు గృహ నిర్మాణాలు రేషన్ కార్డులు తదితర విషయాలపై ఆయన కార్యకర్తలకు అవగాహన కల్పించి అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ య ర్ల జయసీల రావు, భట్టిప్రోలు సాగునీటి వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షులు డొక్కు శ్రీనివాసరావు, భట్టిప్రోలు సాగునీటి వినియోగదారుల సంఘం డైరెక్టర్లు ఆ దిన బసవపున్నయ్య, యార్లగడ్డ పాండురంగారావు, కసుకుర్తి గోవిందు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ఇస్మాయిల్, సువ్వ బాబురావు,ఇర్ఫాన్ బేగ్,కంభం సుధీర్ అధిక సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే నరేంద్రవర్మకు

## అంజుమన్ కమిటీ కృతజ్ఞతలు



పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 30:జమిందార్ పేట స్మశాన వాటిక ప్రహరీగోడ నిర్మాణానికి నిధులు మంజూరు పై హర్షంఅంజుమన్ కమిటీకి అండగా ఉండి జమీదారు పేట బరియల్ గ్రౌండ్ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి సహకరించిన శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మకు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్ జానీ కృతజ్ఞతలు తెలియజేశారు తెలిపారు .స్థానిక పాత బస్టాండ్ వద్ద గల అంజుమన్ కమిటీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని జమిందార్ పేట బరియల్ గ్రౌండ్లో లో ఇటీవల భారీ వర్షాలకు పడిపోయిన గోడ నిర్మాణ పనులు చేపట్టాలని అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మకు వినతి పత్రాన్ని అందించడం జరిగిందన్నారు. వెంటనే స్పందించిన నరేంద్ర వర్మ మున్సిపల్ కమిషనర్ జి .రఘునాథరెడ్డికి గోడ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. శాసనసభ్యుల ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి ప్రహరీగోడ నిర్మాణ పనులు వేగవంతంగా టెండర్లు ప్రక్రియ పూర్తి చేశారన్నారు. టిడిపిపట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు చొరవ తీసుకుని పలుమార్లు గోడ నిర్మాణ పనులు పై మున్సిపల్ కమిషనర్లను కలిసి పర్యవేక్షించారు. జమే దార్ పేట స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు నిధులు మంజూరు చేయించడం పై అంజుమన్ కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు హర్ష వ్యక్తం చేశారు.

## పసుమర్రు గ్రామంలో కోడిపందాలు నలుగురు పట్టివేత.



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 30 :చిలకలూరిపేట : మండలంలోని పసుమర్రు గ్రామ పరిధిలోని జగనన్న ప్లాట్స్ వద్ద జరుగుతున్న కోడిపందాలను పోలీసులు దాడి చేసి నలుగురిని పట్టుకున్నారు. చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ సిబ్బందితో కలిసి నిర్వహించిన తనిఖీలలో 2500 రూపాయల నగదు, రెండు కోడి పుంజులు మరియు మూడు మోటార్ సైకిళ్లను స్వాధీన పరుచుకున్నారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మండల పరిధిలో ఎవరైనా కోడిపందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అనిల్ కుమార్ హెచ్చరించారు.

# షాకింగ్... యూకేలో భారత యువకుడిని కత్తులతో పొడిచి చంపేశారు!



**హైదరాబాద్ పెన్ పవర్:** విదేశాల్లో మృతి చెందిన మరో భారతీయ యువకుడి కథ తాజాగా తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా... యూకేలో వోర్ స్టర్ లో నవంబర్ 25న హర్యానాకు చెందిన విజయ్ కుమార్ షియోరాన్ (30) అనే యువకుడిపై గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడి చేశారు! దీంతో.. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానిక అధికారులు తెలిపారు.

అవును... యూకేలో దారుణం చోటు చేసుకుంది. ఇందులో భాగంగా... భారతీయ యువకుడిపై గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడి చేశారు. ఈ ఘటన ఈ నెల 25న జరగ్గా.. చికిత్స పొందుతూ విజయ్ మృతి చెందాడు. ఈ క్రమంలో ఈ కేసులో ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. వారిని విచారిస్తున్నట్లు తెలిపారు. ఈ హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. విజయ్ కుమార్ ఈ ఏడాది ప్రారంభంలో ఉన్నత చదువుల కోసం యూకేకి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అంతకు ముందు అతడు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ లో ఉద్యోగం చేసేవాడని.. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి, జనవరిలో బ్రిటన్ కు వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనతో ఆ కుటుంబంలో ఒక్కసారిగా తీవ్ర విషాదం అలుముకుంది. ఈ సందర్భంగా స్పందించిన చర్కి దాద్రి ఎమ్మెల్యే సునీత సత్పాల్ సంగ్వాన్.. ఈ ఘటనపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. ఈ సందర్భంగా.. న్యాయం జరిగేలా, నేరస్థులు ఖచ్చితంగా జవాబుదారిగా ఉండేలా.. పారదర్శకంగా, న్యాయంగా, సమయానుకూలంగా దర్యాప్తు జరగాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని భారత్ కు తీసుకురావడానికి ప్రభుత్వ సహాయం కోరారు. మరోవైపు.. బద్రాలో జాగ్రంబాస్ గ్రామంలో నివసిస్తున్న విజయ్ సోదరుడు రవి కుమార్ తక్షణ జోక్యం కోరుతూ విదేశాంగ మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు! ఈ లేఖలో.. విజయ్ తన ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకునే ముందు గతంలో కొచ్చిలో పనిచేసేవాడని తెలిపారు. మద్దతు కోసం కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, హర్యానా సీఎం నయాబ్ సింగ్ షైనీలను కూడా సంప్రదించారని తెలుస్తోంది.

**వెస్ట్ మెర్సియా పోలీసుల అధికారిక ప్రకటన!:**

మంగళవారం ఉదయం (నవంబర్ 25) తెల్లవారుజామున 4:15 గంటల ప్రాంతంలో వోరెస్టర్ లోని బార్బోర్న్ రోడ్ లో 30 ఏళ్ల వ్యక్తిని అధికారులు తీవ్ర గాయాలతో కనుగొన్నారని పోలీసులు తెలిపారు. అనంతరం అతన్ని హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా.. ఆయన చికిత్స పొందుతూ మరణించాడని తెలిపారు. ఈ కేసులో ఐదుగురు అనుమానస్తులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

# మూడేళ్లలో ఇంత మార్పా... చాట్ జీపీటీ ప్రభావం ఏ స్థాయిలో అంటే..!




**హైదరాబాద్ పెన్ పవర్:** మూడేళ్ల క్రితం 2022 నవంబర్ 30 వరకూ ఎవరికి ఏ సందేహం వచ్చినా, ఏ విషయం గురించి తెలుసుకోవాలన్నా.. ఆన్ లైన్ వేదికగా మూడు ఆప్షన్స్ ఉండేవి. ఇందులో భాగంగా... ఒకటి గూగుల్ సెర్చ్ లో టైప్ చేయడం.. వీడియో చూసి తెలుసుకోవాలంటే యూట్యూబ్ కి వెళ్లడం.. అలెక్సాలో అడగడం. కానీ ఆ రోజు తర్వాత లెక్కలు మారిపోయాయి. ఆ మూడు ఆప్షన్స్ నూ పక్కకి నెట్టేసింది చాట్ జీపీటీ! అవును... ఇప్పుడు ఆన్ లైన్ ప్రపంచంలో సెర్చింగ్ లో చాట్ జీపీటీ ఎంట్రన్స్ లా మారిపోయింది. 2022 నవంబర్ 30న ప్రవేశపెట్టబడింది శామ్ ఆల్ట్ మన్ కు చెందిన చాట్ జీపీటీ. ఇది ప్రవేశపెట్టబడిన కొన్ని నెలల్లోనే 100 మిలియన్ల (10 కోట్లు) మంది యూజర్స్ కి చెరువైన చాట్ జీపీటీ.. 2025 చివరి నాటికి 800 మిలియన్ల (80 కోట్లు) మంది వినియోగదారులకు చేరింది. ఈ నెంబర్స్ చాలు చాట్ జీపీటీ ప్రభావం గురించి చెప్పడానికి. ఇలా రోజు రోజుకీ యూజర్స్ ని పెంచుకుంటే.. ఈ భూగ్రహం పై అత్యంత విస్తృతంగా ఉపయోగించే యాప్ గా మారిపోయింది! ఈ క్రమంలో దీన్ని అత్యధికంగా అగ్రరాజ్యం అమెరికాలో వినియోగిస్తుండగా.. అనంతరం భారతదేశమే రెండో అతిపెద్ద మార్కెట్ గా నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో బ్రెజిల్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ ఉన్నాయి. 2025 ప్యూ రీసెర్చ్ సెంటర్ అధ్యయనంలో అమెరికాలో 34% మంది పెద్దలు దీన్ని ఉపయోగించారు. ఇదే క్రమంలో... సిమిలర్ వెబ్ డేటాను ఉపయోగించిన ఒక నివేదిక ప్రకారం... గూగుల్ నుంచి న్యూస్ సైట్ లకు ట్రాఫిక్ 2024 మధ్యలో 2.3 బిలియన్లకు పైగా విజిట్స్ ఉండగా.. 2025 మే నాటి ఆ సంఖ్య 1.7 బిలియన్లకు పడిపోయింది. అదే విధంగా.. జీరో క్లిక్ లతో ముగిసే న్యూస్ లకు సంబంధించిన సెర్చ్ వాటా ఒక సంవత్సర కాలంలో 56% నుంచి 69%కి పెరిగింది. దీనికి కారణం ఏఐ సృష్టించిన స్నాప్ చాట్ ను దాటి చాలా మంది స్క్రోల్ చేయకపోవడమే. అదేవిధంగా... చాట్ జీపీటీ ప్రభావం సెర్చ్ ఇంజిన్ లకు మించి ప్రతిధ్వనించింది. ఇందులో భాగంగా.. అలెక్సా స్పీకర్లు, గూగుల్ హోమ్ వంటి వాయిస్ అసిస్టెంట్ల సంఖ్య కొద్దిగా తగ్గింది. 2025 వాయిస్ సెర్చ్ గణాంకాల సారాంశం ప్రకారం... 12 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారిలో సుమారు 34% మంది స్మార్ట్ స్పీకర్ ను కలిగి ఉన్నారని అంచనా వేయబడింది. ఇది 2023లో 35%గా ఉంది. అయితే దీనికి వురుద్ధంగా యూట్యూబ్ మాత్రం ఇప్పటికీ ఒక పెద్ద సైట్ గానే ఉందని చెబుతున్నారు. దీనికి 2024 నాటికి సుమారు 2.74 బిలియన్ల వినియోగదారులు ఉండగా.. 2010 నుంచి ఆ సంఖ్య క్రమంగా పెరుగుతోందని అంటున్నారు. ఈ క్రమంలో అమెరికాలో టీనేజర్లు సుమారు 90% మంది తాము యూట్యూబ్ ని వినియోగిస్తున్నామని చెబుతున్నారు. వాస్తవానికి చాట్ జీపీటీ లాంచ్ అయిన కొత్తలో.. ఏఐ వల్ల లక్షలాది ఉద్యోగాలు పోతాయని నిపుణులు అంచనా వేశారు. అయితే కొన్ని రంగాల్లో నిజంగానే దీని ప్రభావం మొదలైంది. ఇందులో భాగంగా... వెబ్ డెవలపర్ లు, ట్రాన్స్ లేటర్లు, అమెరికన్ కాలేజీ విద్యార్థుల కోసం ఎస్సేలు రాసే కెన్యా ఫ్రీలాన్సర్లు దీని కారణంగా తీవ్రంగా దెబ్బతిన్నారని చెబుతున్నారు. ఏది ఏమైనా.. ఇది చాట్ జీపీటీ టైమ్ అని మాత్రం చెప్పొచ్చు!


# వీరి వయసు 22 ఏళ్లు.. వీళ్ల సంస్థ విలువ రూ.80వేల కోట్లు!



**హైదరాబాద్ పెన్ పవర్:** ముగ్గురు స్నేహితులు.. అందులో ఇద్దరు భారత్ నుంచి వెళ్లి అమెరికాలో స్థిరపడిన కుటుంబాలకు చెందిన వారు. వీళ్ల పేర్లు.. సూర్యమిథా, ఆదర్శ్ హిరేమత్, బ్రెండెన్ ఫూడీ. వీళ్లు ముగ్గురు అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో ఉన్న బెల్లార్ మెన్ కాలేజీ ప్రిపరేటరీ స్కూల్లో ఫ్రెండ్స్. అప్పటి నుంచీ వీళ్లది సక్సెస్ ఫుల్ టీమ్. స్కూల్ లో డిబేట్ పోటీలు పెడితే సూర్య – ఆదర్శ్ టీమ్ ఎప్పుడూ ముందుండేది. ఈ క్రమంలో వీరిద్దరికీ బ్రెండెన్ కూడా జత కలిశాడు. అవును... అద్భుతాలు సృష్టించాలంటే బాగా చదువుకోవాల్సిన అవసరమే లేదు! ప్రధానంగా ఎవరిని వారు నమ్ముకోవాలి.. ఎంచుకునే మార్గంపై పట్టు సంపాదించాలి.. టీమ్ వర్క్ పై నమ్మకం పెట్టుకోవాలి. వీళ్లు ముగ్గురూ చేసింది అదే. వాస్తవానికి హైస్కూల్ చదువయ్యాక వీళ్లు ముగ్గురూ వారికి నచ్చిన కోర్సుల్లో జాయిన్ అయ్యారు. ఇందులో భాగంగా... జార్జ్ టౌన్ యూనివర్సిటీలో బ్రెండెన్ ఎకనామిక్స్ చదువుతుంటే.. అదే యూనివర్సిటీలో సూర్యామిథా ఫారిన్ సర్వీస్ కోర్సులో చేరాడు. మరోవైపు హార్వర్డ్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్ కోర్సులో చేరాడు ఆదర్శ్. ఇలా ఎవరి అభిరుచికి తగ్గట్లు వాళ్ల కోర్సులు ఎంచుకున్నా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కచ్చితంగా భవిష్యత్తును శాసించబోతోందని మాత్రం బలంగా నమ్మారు. ఈ క్రమంలో ఒక ఏఐ స్టార్టప్ పెట్టాలని అనుకుని.. అనుకున్నదే తడవుగా రంగంలోకి దిగారు. ఈ క్రమంలోనే "మెర్కోర్" అనే సంస్థను స్థాపించారు. ఇండియాలోని ఐటీ అభ్యర్థులకు ఆన్ లైన్ వేదికగా అమెరికాలో ఉద్యోగాలు చూపించాలన్నది ఈ స్టార్టప్ లక్ష్యం. అయితే ఇక్కడ వీరు రొటీన్ కి భిన్నంగా ఆలోచించింది ఏమిటంటే.. ఇక్కడ అభ్యర్థుల నియామకంలో మనుషులని కాకుండా ఏఐని వాడాలనుకున్నారు. ఈ సమయంలో... ఏఐ అవతార్ లే స్క్రీనింగ్ నుంచి ఇంటర్వ్యూలు, జీతాలు, అభ్యర్థులు ఏ ఉద్యోగానికి సరిపోతారు వంటి అన్ని పనులూ చక్కబెడతాయి. దీనికోసం వాళ్లు చదువు మధ్యలోనే మానేశారు!

అది రిస్క్ అని అనిపించినా... లైఫ్ లో ఏ రిస్కూ తీసుకోకపోవడమే అతి పెద్ద రిస్క్ అనే సిద్ధాంతాన్ని నమ్మినట్లున్నారు! ఇలా తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో ఉద్యోగ నియామకాలను పూర్తి చేసే ఆలోచన పెట్టుబడిదారులకు బాగా నచ్చింది. ఈ నేపథ్యలోనే... ఉబర్ లాంటి కంపెనీకి నిధులు ఇచ్చి, ప్రోత్సహించిన బెంచ్ మార్క్ సంస్థ వీళ్లకీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. ఇదే సమయంలో.. మరికొన్ని సంస్థలూ తోడవ్వడంతో వీళ్లకు 30వేల కోట్లు అందాయి. ఇక వాళ్లు వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. తాము ఎంచుకున్న మార్గంలో రిక్రూట్ మెంట్ ఇండస్ట్రీలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి.. ఐదు లక్షల మంది అభ్యర్థులను స్క్రీనింగ్ చేసిన మెర్కోర్ విలువ ఇప్పుడు రూ.80 వేల కోట్లకు చేరుకుంది. దీంతో... 22 ఏళ్ల వయసులోనే వీళ్లు బిలియనీర్స్ గా ఎదిగి.. 23 ఏళ్ల వయసులో ప్రపంచంలో అత్యంత చిన్న వయస్సు బిలియనీర్ గా జుకర్ బర్గ్ పేరిట ఉన్న రికార్డును ఈ ముగ్గురూ బద్దత్లు కొట్టారు. కేవలం 30 మంది సభ్యులు మాత్రమే ఉన్న ఈ సంస్థకి బ్రెండెన్ సీఈఓగా ఉన్నారు. ఇక ఢిల్లీ నుంచి కాలిఫోర్నియా వెళ్లి స్థిరపడిన కుటుంబానికి చెందిన సూర్యామిథా ఛైర్మన్ గా ఉన్నారు. ఇదే సమయంలో.. కర్ణాటక నుంచి వెళ్లి స్థిరపడిన కుటుంబానికి చెందిన ఆదర్శ్ సీటీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. వీళ్ల సేవలకు రోజుల చొప్పున కాకుండా గంటల చొప్పున ఫీజుని వసూలు చేస్తున్నారు.

# ఫిర్యాదుదారే నిందితుడు.. టీటీడీ నెయ్యి కేసులో ట్విస్టు! మరో 11 మందిపై కేసులు




**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమల కల్తీ నెయ్యి కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. డిసెంబరు 15లోగా సుప్రీంకోర్టులో చార్జిషీటు దాఖలు చేయాలన్న టార్గెట్ పెట్టుకున్న సీబీఐ సిట్ కేసు దర్యాప్తులో వేగం పెంచింది. ఇటీవల టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి విచారణ, ఆ తర్వాత అప్పటి ప్రొక్యూర్మెంట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం అరెస్టు చేసింది. ఇక తాజాగా టీటీడీలో పనిచేస్తున్న మరో 11 మందికి ఈ కల్తీ వ్యవహారంలో భాగస్వామ్యం ఉందని సిట్ తేల్చింది. ఇందులో కేసు పెట్టిన ఫిర్యాదుదారు కూడా నిందితుడుగా ఆరోపణలు ఎదుర్కోవడం గమనార్హం. టీటీడీలో మొత్తం 12 మంది పాత్ర ఉన్నట్లు సిట్ తేల్చగా, ఇందులో అప్పటి జీఎం సుబ్రహ్మణ్యంను ఇప్పటికే అరెస్టు చేశారు. ఇక మిగిలిన 11 మందిలో ఆరుగురు టీటీడీ అదికారులు కాగా, మిగిలిన వారు టీటీడీ నియమించుకున్న డెయిరీ నిపుణులుగా చెబుతున్నారు. ఈ మొత్తం 11 మంది కల్తీ నెయ్యి వచ్చేందుకు సహకరించారని సిట్ దర్యాప్తులో తేలినట్లు చెబుతున్నారు. కాగా, నెయ్యి కల్తీపై ముఖ్యమంత్రి చంద్రబాబు బయటపెట్టిన వెంటనే, ఈ వ్యవహారంపై విచారణ జరపాలని పోలీసులకు ఫిర్యాదు చేసిన జీఎం మురళీకృష్ణ కూడా నిందితుడిగానే సిట్ తేల్చడం చర్చనీయాంశమైంది.

కల్తీ నెయ్యి కేసులో ఏ25గా తిరుమల గోడౌన్ కీపర్ ఈశ్వరరెడ్డి, ఏ26గా ప్రొక్యూర్మెంట్ విభాగం పూర్వ సీనియర్ అసిస్టెంట్ అనిల్ కుమార్, ఏ27గా తిరుపతి గోడౌన్ ఇన్చార్జి వెంకటనటేశ్ బాబు, ఏ28గా పేరూరి జగదీశ్వరరెడ్డి, ఏ30గా ఫిర్యాదుదారు ప్రళయకావేరి మురళీకృష్ణ, ఏ31గా టీటీడీ గోశాల పూర్వపు డైరెక్టర్ హరినాథరెడ్డి, ఏ32 నుంచి ఏ36 వరకు టీటీడీ టెక్నికల్ ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులుగా నియమించిన డెయిరీ నిపుణులు మల్లం మహేందర్, వి.వెంకట సుబ్రహనియన్, ఎం.విజయభాస్కరరెడ్డి, బత్తుల సురేంద్రనాథ్, కె.జయరాజారావులను గుర్తించారు. కాగా, నిందితుల్లో ఇద్దరు రిటైర్డ్ ఉద్యోగులు ఉండగా, మరొకరి పదవీకాలం నవంబరుతోనే పూర్తయింది.

నిందితులు అంతా కలిసి టీటీడీకి నెయ్యి సరఫరా చేసే డెయిరీలతో కుమ్మక్కై లడ్డూ ప్రసాదంలో కల్తీకి కారణమయ్యారని సిట్ ఆరోపిస్తోంది. ప్రధానంగా టీటీడీకి నెయ్యి సరఫరా చేసే డెయిరీలు టెండర్లలో పాల్గొనేందుకు నిజంగానే అర్హత, సామర్థ్యం ఉందా అన్నది తెలుసుకునేందుకు ఆయా డెయిరీలను టెక్నికల్ టీమ్ తనిఖీ చేసి టీటీడీకి నివేదిక ఇవ్వాల్సివుంటుంది. అయితే టెక్నికల్ టీంలో ఉన్నవారు డెయిరీలను సందర్శించకుండానే తప్పుడు నివేదికలు ఇచ్చారని సిట్ అభియోగాలు మోపుతోంది. అదేవిధంగా ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ అయిందని తెలిసి కూడా ఆ విషయం దాచిపెట్టినట్లు సిట్ చెబుతోంది. మైసూరులోని సీఎఫ్టీఆర్ఐ ల్యాబ్ వెజిటబుల్ ఆయిల్స్ తో నెయ్యి కల్తీ అయినట్లు గుర్తించి, ఆ రిపోర్టును టీటీడీకి పంపింది. దాన్ని పరిశీలించాల్సిన సురేంద్రనాథ్ అనే టీటీడీ డెయిరీ నిపుణుడు అన్ని పారామీటర్లు సక్రమంగా ఉన్నట్లు నివేదిక సమర్పించినట్లు సిట్ గుర్తించింది. ఇలా మొత్తం నిందితులు అంతా తమతమ స్థాయిల్లో సహకరించి శ్రీవారి ప్రసాదంలో కల్తీకి కారణమయ్యారని సిట్ తేల్చిందని అంటున్నారు.

# కొత్త సీఎస్ గా సాయిప్రసాద్.. ఫిబ్రవరి వరకు విజయానంద్ కు చాన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పదవీ కాలాన్ని మరో మూడు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. డిసెంబరు 1వ తేదీ నుంచి 2026 ఫిబ్రవరి 28 వరకూ సీఎస్ పదవీకాలాన్ని పొడిగిస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ప్రభుత్వం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇదే సమయంలో ఆయన రిటైర్మెంట్ తర్వాత కొత్త ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుత జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి జి.సాయిప్రసాద్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వచ్చే ఏడాది మార్చి 1న ఆయన సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

వాస్తవానికి నవంబరు 30న సీఎస్ విజయానంద్ పదవీ విరమణ చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఆయన పదవీ కాలాన్ని మరో మూడు మాసాలు పొడిగిస్తూ కేంద్ర డిపార్టుమెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఓపిటి) పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వచ్చే ఫిబ్రవరి 28వ తేదీ వరకు సీఎస్ విజయానంద్ పదవిలో కొనసాగుతారు. ఇక విజయానంద్ తర్వాత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అవుతున్న సాయిప్రసాద్ 1991 ఐఏఎస్ బ్యాచ్ అధికారి. 1992లో వరంగల్ జాయింట్ కలెక్టర్ గా కెరీర్ ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన ప్రస్తుతం ముఖ్యమంత్రి ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కొన్నాళ్లు కేంద్ర సర్వీసుల్లో కూడా సాయి ప్రసాద్ పనిచేశారు.

ఇక కొత్త సీఎస్ కానున్న సాయిప్రసాద్ వచ్చే ఏడాది మే నెలలో పదవీ విరమణ చేయనున్నారు. అయితే ఆయన పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించే అవకాశం ఉందని అంటున్నారు. ఐఐటీ ఢిల్లీ నుంచి ఎంటెక్ గ్రాడ్యుయేట్ అయిన సాయిప్రసాద్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) చీఫ్ కమిషనరుగా ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ సీఎండీగా పనిచేశారు. ఏపీ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ హోదాలోనూ కొన్నాళ్లు సేవలు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహిత అధికారిగా సాయిప్రసాద్ ను చెబుతారు.

కాగా, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న అధికారులు తర్వాత సీఎస్ లుగా పదోన్నతులు పొందడం ఆసక్తి రేపుతోంది. గతంలో సీఎస్ లుగా పనిచేసిన ఆదిత్యనాథ్ దాస్, కేఎస్ జవహర్ రెడ్డి కూడా గతంలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా పనిచేస్తూ సీఎస్ లుగా పదోన్నతులు పొందారు. ప్రస్తుతం జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి.సాయిప్రసాద్ తాజాగా సీఎసగా నియమితులయ్యారు. ఒకే శాఖ.. ఒకే గది.. నుంచి ముగ్గురు సీఎస్‌లు అయ్యారని ఐఏఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పుడు ఈ గది ప్రత్యేక సెంటిమెంట్‌గా మారుతుందేమోనని కొందరు ఐఏఎస్‌లు అంటున్నారు.

## రికార్డ్ బద్ధలు కాదు.. సరికొత్త చరిత్ర: సచిన్ ఆల్‌టైం రికార్డ్ బ్రేక్ చేసిన కోహ్లీ



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీకి రికార్డ్స్ బ్రేక్ చేయడం కొత్త కాదు. ప్రతి మ్యాచ్ లో ఏదో ఒక రికార్డ్ బ్రేక్ చేస్తూ క్రికెట్ లో దూసుకెళ్తాడు. అయితే ఈ సారి రికార్డ్ బద్దలు కొట్టడం కాదు సరికొత్త చరిత్ర సృష్టించాడు. అదేంటో కాదు ఒకే ఫార్మాట్ లో అత్యధిక సెంచరీలు సాధించడం. ఆదివారం (నవంబర్ 30) రాంచీ వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి వన్డేలో కోహ్లీ సెంచరీతో సత్తా చాటాడు. 102 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్న విరాట్.. ఓవరాల్ గా 120 బంతుల్లో 135 పరుగులు చేసి అదిరిపోయే ఇన్నింగ్స్ ఆడాడు. కోహ్లీకి వన్డే ఫార్మాట్ లో ఇది 52వ సెంచరీ కావడం విశేషం.

క్రికెట్ లో ఇప్పటివరకు ఒక ఫార్మాట్ లో ఏ ప్లేయర్ కూడా 52 సెంచరీలు చేయలేదు. సచిన్ టెండూల్కర్ టెస్టుల్లో 51 సెంచరీలు చేస్తే.. ఈ మ్యాచ్ కు ముందు కోహ్లీ వన్డేల్లో 51 సెంచరీలు చేశాడు. ప్రస్తుతం సఫారీలపై కోహ్లీ సెంచరీ కొట్టడంతో కోహ్లీ వన్డే సెంచరీల సంఖ్య 52కి చేరింది. దీంతో సింగిల్ ఫార్మాట్లో అత్యధిక? శతకాల వీరుడిగా ఉన్న టీమిండియా బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ రికార్డును బద్దలు కొట్టాడు. ఈ సెంచరీతో ఒకే ఫార్మాట్లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్ గా చరిత్ర సృష్టించాడు. కోహ్లీ అంతర్జాతీయ కెరీర్ లో ఇది 83వ సెంచరీ. 100 సెంచరీలతో సచిన్ అగ్రస్థానంలో ఉన్నాడు.

సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి వన్డే విషయానికి వస్తే టీమిండియా భారీ స్కోర్ తో చెలరేగింది. ఆదివారం (నవంబర్ 30) రాంచీ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ లో సొంతగడ్డపై సఫారీ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ భారీ స్కోర్ చేశారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సెంచరీ (120 బంతుల్లో 135: 11 ఫోర్లు, 7 సిక్సర్లు)తో విధ్వంసం సృష్టిస్తే.. రోహిత్ శర్మ (57) హాఫ్ సెంచరీతో అదరగొట్టాడు. కేఎల్ రాహుల్ (60) కెప్టెన్ ఇనింగ్స్ తో సత్తా చాటాడు. దీంతో మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది. కోహ్లీ 135 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. సౌతాఫ్రికా బౌలర్లలో బార్ట్ మాన్, బర్గర్, జాన్సెన్, బాష్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు.

## KKR తప్ప మరో జట్టుకు ఆడను.. ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించి షాక్ ఇచ్చిన రస్సెల్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026కి ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ మాజీ ప్లేయర్ ఆంద్రీ రస్సెల్ షాకింగ్ నిర్ణయం తీసుకున్నాడు. 37 ఏళ్ల రస్సెల్ ఐపీఎల్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆదివారం (నవంబర్ 30) ఇంస్టాగ్రామ్ ద్వారా రస్సెల్ ఈ విషయాన్ని వెల్లడించి ఫ్యాన్స్ కు బిగ్ షాక్ ఇచ్చాడు. తాను వేరే ఫ్రాంచైజీతో ఒప్పందం కుదుర్చుకోనని.. బదులుగా 2026 సీజన్ కోసం కేకేఆర్ సపోర్టింగ్ స్టాఫ్ లో "పవర్ కోచ్"గా చేరుతానని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా తెలిపాడు. 2026 ఐపీఎల్ మినీ వేలానికి ముందు కేకేఆర్ జట్టు తనను రిలీజ్ చేయడంతో రస్సెల్ ఈ నిర్ణయం తీసుకున్నాడు.

రస్సెల్ ఇంస్టాగ్రామ్ పోస్ట్ లో ఇలా ఉంది. "ఐపీఎల్‌లో నాకు కొన్ని అద్భుతమైన ప్రయాణం.. గొప్ప జ్ఞాపకాలు ఉన్నాయి. సిక్సర్లు కొట్టడం, మ్యాచ్ లు గెలిపించడం, మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్ ట్రోఫీ గెలవడం వంటిని చాలా మధురమైన జ్ఞాపకాలు. నేను ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు ఇదే అత్యుత్తమ నిర్ణయం అని నాకు అనిపించింది. నేను వేరే జట్టుకు వెళ్లాలని అనుకోవడం లేదు. ఫ్యాన్స్ నాలో కొంత ఆట మిగిలి ఉందని.. నన్ను కొని సీజన్ ల పాటు ఆడమని కోరారు. అయితే ఇదే నా రిటైర్మెంట్ కు సరైన సమయం అనిపించింది". అని రస్సెల్ చెప్పుకొచ్చాడు.ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్ కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ రస్సెల్ ను ఈ సారి ఆ జట్టు ఫ్రాంజైజీలు రిటైన్ చేసుకోవడానికి ఆసక్తి చూపించలేదు. దశాబ్ద కాలంగా కేకేఆర్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన విండీస్ ఆల్ రౌండర్ ను ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్ కు ముందు రిలీజ్ చేసి ఊహించని షాక్ ఇచ్చింది. అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన రస్సెల్.. గత సీజన్ లో ఘోరంగా విఫలమయ్యాడు. దీంతో కేకేఆర్ రస్సెల్ ను వదులుకునేందుకు సిద్ధమైంది.కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఆంద్రీ రస్సెల్ 109 మ్యాచ్‌లు ఆడి 2593 పరుగులు చేశాడు. కేకేఆర్ తరపున బౌలింగ్ లోనూ రాణించి 122 వికెట్లు పడగొట్టాడు. రస్సెల్ జట్టులో ఉన్నప్పుడు కేకేఆర్ రెండు టైటిల్స్ కూడా గెలుచుకుంది. రస్సెల్ 2014 నుండి కేకేఆర్ జట్టు తరపున ఆడుతున్నాడు. 2025 ఐపీఎల్ మెగా ఆక్షన్ ముందు రస్సెల్ ను కేకేఆర్ రూ. 12 కోట్లకు రిటైన్ చేసుకుంది. 2025 ఐపీఎల్ సీజన్ లో ఈ విండీస్ ఆల్ రౌండర్ 167 పరుగులు మాత్రమే చేసి 8 వికెట్లు పడగొట్టాడు. వయసు ఎక్కువగా ఉండడంతో పాటు ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించడం రస్సెల్ కు మైనస్ గా మారింది.

2025లో అజింక్య రహానే కెప్టెన్సీలోని కేకేఆర్ జట్టు 14 మ్యాచ్‌లలో కేవలం 5 విజయాలతో పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. 2024 లో శ్రేయాస్ కెప్టెన్సీలో కోల్‌కతా నైట్ రైడర్స్ అద్భుతంగా ఆడి టైటిల్ గెలిచింది. 2025 ఐపీఎల్ సీజన్ లో కేకేఆర్ ప్లే ఆఫ్స్ కు చేరకపోవడంతో 2026 ఐపీఎల్ సీజన్ లో కొత్త వ్యూహాలతో బరిలోకి దిగనుంది. 2026 ఐపీఎల్ సీజన్ కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ తమ కోచింగ్ సిబ్బందిలో ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేసింది. జట్టుకు కొత్త ప్రధాన కోచ్ గా అభిషేక్ నాయర్ నియమించిన కేకేఆర్.. గురువారం (నవంబర్ 13) షేన్ షేన్ వాట్సన్‌ను అసిస్టెంట్ కోచ్‌గా ప్రకటించింది. తాజాగా న్యూజిలాండ్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ టిమ్ సౌథీని కొత్త బౌలింగ్ కోచ్‌గా నియమించుకున్నారు.

## వన్డేల్లో రోహిత్ శర్మ సరికొత్త రికార్డు.. అఫ్రిది రికార్డు తెరమరుగు

**వన్డే క్రికెట్‌లో అత్యధిక సిక్సర్ల రికార్డు నెలకొల్పిన రోహిత్ శర్మ**

**పాకిస్థాన్ మాజీ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది రికార్డు బద్దలు**

**అఫ్రిది కంటే 100 ఇన్నింగ్స్‌లు వేగంగా ఈ ఘనత సాధించిన హిట్‌మ్యాన్**

**ఈ మ్యాచ్‌లో 57 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడిన రోహిత్**



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మాజీ కెప్టెన్, స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ వన్డే క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈ ఫార్మాట్‌లో అత్యధిక సిక్సర్లు (352) బాదిన ఆటగాడిగా నిలిచాడు. ఈ క్రమంలో, పాకిస్థాన్ మాజీ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది పేరిట ఉన్న రికార్డును 'హిట్‌మ్యాన్' అధిగమించాడు. ఇవాళ దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో రోహిత్ శర్మ ఈ ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు.ఈ మ్యాచ్‌కు ముందు అఫ్రిది (351 సిక్సర్లు) రికార్డును సమం చేయడానికి రోహిత్‌కు రెండు సిక్సర్లు అవసరమయ్యాయి. ఆఫ్ స్పిన్నర్ ప్రినిలాన్ సుబ్రాయెన్ బౌలింగ్‌లో వరుసగా రెండు భారీ షాట్లతో అఫ్రిది రికార్డును సమం చేశాడు. ఆ తర్వాత మార్కో జాన్‌సెన్ బౌలింగ్‌లో తన ఫేవరెట్ పుల్ షాట్‌తో మరో సిక్సర్ బాది ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నాడు. 38 ఏళ్ల వయసులోనూ తనదైన శైలిలో బ్యాటింగ్ కొనసాగిస్తూ ఈ అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. విశేషమేమిటంటే, అఫ్రిది కంటే దాదాపు 100 ఇన్నింగ్స్‌లు తక్కువ ఆడి రోహిత్ ఈ మైలురాయిని చేరుకోవడం గమనార్హం.ఈ మ్యాచ్‌లో ఆరంభంలోనే 1 పరుగు వద్ద టోనీ డి జోర్జి క్యాచ్ జారవిడచడంతో రోహిత్‌కు లైఫ్ లభించింది. ఆ తర్వాత విరాట్ కోహ్లీతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. నిలదొక్కుకున్నాక బౌండరీలతో విరుచుకుపడ్డాడు. రికార్డు సాధించిన తర్వాత దూకుడుగా ఆడుతూ యన్‌సెన్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. కోహ్లీతో చర్చించినా డీఆర్ఎస్ తీసుకోకుండా పెవిలియన్‌కు చేరాడు. మొత్తం 51 బంతులాడిన రోహిత్ 5 ఫోర్లు, 3 సిక్సులతో 57 పరుగులు చేశాడు. ఈ రికార్డుతో క్రిస్ గేల్, ధోనీ, జయసూర్య వంటి దిగ్గజాల సరసన రోహిత్ అగ్రస్థానంలో నిలిచాడు.

# డైరెక్టర్ కోసం హీరో వెయిటింగ్ !



సప్తమి గౌడ వెల్వెట్ చీరలో అబ్బురపరుస్తుంది





అనన్య పాండే తన ఫేవరెట్ లుక్స్‌లో ఒకదాన్ని షేర్ చేసింది

అన్నీ అనుకున్నట్లు జరిగితే - ఎల్ సీ యూ - నుంచి - ఖైదీ 2 - ఇప్పటికే మొదలవ్వాలి. కానీ కార్తీ వేర్వేరు సినిమాలతో బిజీగా ఉండగా, లోకేష్ కనగరాజ్ తన పనుల్లో తాను బిజీగా ఉన్నాడు. మరి ఈ డిలేకి కారణం ఏంటి? అంటే? కొన్నాళ్ల పాటు డైరెక్షన్ పక్కన బెట్టి హీరోగా లక్ చెక్ చేసుకోవడమే. %-%కూలీ%-% రిలీజ్ అనంతరం లోకేష్ కనగరాజ్ హీరోగా మ్యాకప్ వేసుకున్న సంగతి తెలిసిందే. అరుణ్ మాథేశ్వర్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. లోకేష్ మార్క్ క్రైమ్ థ్రిల్లర్ కావడం..హీరో ఛాన్స్ అనే సరికి లోకేష్ కూడా వెయిటింగ్ ఎందుకునుకున్నాడో? ఏమో గానీ మారు మాట్లాడకుండా పట్టాలెక్కించాడు ప్రాజెక్ట్.

**డిసెంబర్ లో రెండు రిలీజ్ లతో:**

డీసీ%-% అనే టైటిల్ తో తెరకెక్కుతోన్న చిత్రమిది. మరి ఈ సినిమా రిలీజ్ ఎప్పుడు అంటే వచ్చే ఏడాది సమ్మర్ వరకూ రిలీజ్ కాదు. మరి %-%ఖైదీ2%-% మొదలయ్యేది ఎప్పుడు? అంటే రిలీజ్ తర్వాతేనని తెలుస్తోంది. దీంతో లోకేష్ కోసం కార్తీ వెయిట్ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం కార్తీ హీరోగా %-%మార్షల్%-% అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా తప్ప మరే సినిమా షూటింగ్ దశలో లేదు. కార్తీ నటించిన - వా వాతయార్ - ఇప్పటికే రిలీజ్ కు రెడీ గా ఉంది. డిసెంబర్ లో ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. కార్తీ నటిస్తోన్న మరో చిత్రం - సర్దార్ - 2 కూడా షూటింగ్ పూర్తి చేసుకుంది.

**కార్తీకి ఇదో కొత్త ఎక్స్ పీరియన్స్:**

ప్రస్తుతం ఆ ప్రాజెక్ట్ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఈ సినిమా వచ్చే ఏడాది ఆరంభంలో రిలీజ్ అవుతుంది. ఈ రెండు సినిమాలకు సంబంధించి కార్తీ కేవలం ప్రచార కార్యక్రమాల్లో మాత్రమే పూర్తి చేయాల్సి ఉంది. ఆ రెండు రిలీజ్ అయితే వాటి నుంచి పూర్తిగా రిలీవ్ అవుతాడు. - మార్షల్ - కూడా మరో రెండు..మూడు నెలల్లో షూటింగ్ పూర్తవుతుందని సమాచారం. ఆ తర్వాత - ఖైదీ 2 - మొదలయ్యే వరకూ కార్తీకి వెయిటింగ్ తప్పదు. ఆ వెయిటింగ్ లోకేష్ వల్లే. ఇలా డైరెక్టర్ కోసం హీరో వెయిట్ చేయడం అన్నది కార్తీ అనుభవంలో ఇదే తొలిసారి కావొచ్చు.

**కొత్త కథలు వినే ఛాన్సుంది:**

సాధారణంగా హీరోల కోసం డైరెక్టర్లు వెయిట్ చేస్తుంటారు. కానీ లోకేష్-కార్తీ మధ్య సన్నివేశం అందుకు భిన్నంగా కనిపిస్తుంది. మరి ఈ గ్యాప్ లో కార్తీ ఏం చేస్తాడు? అంటే కొత్త కథలు వినడానికి అవకాశం ఉంది. - మార్షల్ - కూడా నత్తనడకన షూటింగ్ జరుతుంది. దీంతో కార్తీ కి సమయం ఎక్కువగానే దొరుకుతుంది. షూటింగ్ ఉంటే చేయడం లేదంటే కథలు వినడంపైనే దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965